లేజర్ చికిత్స
- అత్యంత అధునాతన లేజర్ పరికరంతో చిగుళ్ల వ్యాధికి ప్రత్యేక చికిత్స.
- 7గురు స్పెషలిస్టు డాక్టర్లు కలిగిన ఏకైక సూపర్ స్పెషాలిటీ దంతవైద్యశాల.
- రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు వారి కుటుంబసభ్యులకు రీయంబర్స్‌మెంట్ సదుపాయం కలదు.
డాక్టర్ అలూరు సురేష్‌కుమార్‌రెడ్డి M.D.S.
Professor, Endodontics
KCR సూపర్ స్పెషాలిటీ దంతవైద్యశాల
పాగతోట, నెల్లూరు. ఫోన్ : 2303300.

Licenced to Post without Prepayment (AP/VJ-16/WPP/2012-13)

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు స్థాపితం: 1930 జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

Longest Living Newspaper in Telugu Journalism

జమీన్‌రైతు

సంపుటి: 82 • సంచిక: 51 • 14-12-2012 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-



ప్రభుత్వానికి పక్షవాతం!

రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాలకు సంబంధించి కాంగ్రెస్ అధిష్టానం తీవ్రమైన అయోమయంలో వున్నట్లు అర్థమౌతున్నది. ఏ అంశంలో కూడా నిర్ణయం తీసుకొనేవాడు కానీ, కనీసం మనసు పెట్టి ఆలోచన చేసేవాడు కానీ ఢిల్లీలో కన్పించడం లేదు. మన రాష్ట్రానికి ప్రస్తుతం గులాం నబీ ఆజాద్ పరిశీలకుడిగా వున్నాడు. ఆయనకు మన రాష్ట్రంతో దాదాపు 15ఏళ్ల సుదీర్ఘ అనుభవం వుంది. ప్రతి మనిషి తెలుసు. ప్రతి సమస్యా తెలుసు. కానీ తనను కలవడానికి వచ్చే రాష్ట్ర కాంగ్రెస్ వాదులను కలవడానికి గులాం నబీ ఆజాద్ ఏ మాత్రం ఇష్టపడడం లేదు. ఒకవేళ కలిసినా అంటీ ముట్టనట్లు మాట్లాడుతున్నాడు. జగన్ విషయం కానీ, తెలంగాణ విషయం కానీ, కిరణ్ విషయం కానీ ప్రస్తావిస్తే పొడి పొడి మాటలతో సమాధానం చెప్తున్నాడు. గతవారం ఆయన హైదరాబాదు వచ్చాడు. సాధారణంగా ఎఐసిసి పరిశీలకుడు హైదరాబాదు వస్తే చెప్పలేని హడావుడి వుంటుంది. ముఖ్యమంత్రి, పిసిసి అధ్యక్షులతో సహా పార్టీ మొత్తం అక్కడే వుంటుంది. కానీ ఈసారి మాత్రం గులాం నబీ ఆజాద్ ముందుగానే చెప్పాడు – తాను ప్రైవేట్ కార్యక్రమం మీద వస్తున్నాను కాబట్టి తనను ఎవరూ కలవడానికి లేదని. కేంద్రంలో అధికారంలో వున్న నేత ప్రైవేటు కార్యక్రమం మీద వచ్చినా, పార్టీ కార్యక్రమం మీద వచ్చినా ఒకటిగానే చూడాలి. ఎవరినీ కలవడానికి ఇష్టపడకపోవడం అంటే, ఎవరు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేని అసక్తత అని అర్థం.

ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డిని మార్చాలని రెండు నెలల క్రితం నిర్ణయం తీసుకొన్నారు. ఆ సూచన కూడా ఇచ్చారు. ఈలోగా ఎఫ్‌డిఐ గొడవ, మల్లిస్ చీకాకు తలెత్తాయి కాబట్టి తాత్కాలికంగా వాయిదా వేశారు. కానీ ఇప్పుడా అంశాన్ని ప్రస్తావించేవారే ఢిల్లీలో లేరు. కాంగ్రెస్ జాతీయ వ్యవహారాలలో ఎఐసిసి ప్రధాన కార్యదర్శులైన వారు, సోనియా రాజకీయ కార్యదర్శి అహ్మద్ పటేల్, చిదంబరం వంటి కీలక నేతలు సోనియా వద్దకు వెళ్లి వివరణ ఇస్తుంటారు. కానీ ఇప్పుడు గులాం నబీ ఆజాద్ కానీ, మరొక ఆంధ్ర ఇన్‌ఛార్జి వాయిలార్ రవి కానీ, చిదంబరం కానీ ఆంధ్ర విషయంలో వేలు పెట్టే సాహసం చేయడం లేదు. అహ్మద్ పటేల్ అసలు ఏ విషయంలోనూ సోనియాగాంధీ వద్దకు వెళ్లలేక పోతున్నాడు. ఆయన స్వరాష్ట్రమైన గుజరాత్ వ్యవహారాలలో ఆయన చేసిన సిఫార్సులు, తీసుకొచ్చి కలిపిన మనుషులు విఫలం కావడంతో సోనియా ఆయన మీద ఆగ్రహంతో వున్నదట. దానితో కొంత కాలం ఆమెకు దూరంగా మనసులడమే తన ఒంటికి ఆరోగ్యం అనుకొంటున్నాడు అహ్మద్ పటేల్.

కొరవ 14వ పేజీలో



• జగన్‌ను తీహార్ జైలుకు తరలిస్తారా?

జగన్ భవిష్యత్తు ఏమిటి? ఆయన మీదున్న కేసుల పురోగతి ఏమిటి? జగన్‌తో కాంగ్రెస్ అధిష్టానం రాజీ నిజమా? నిజమైతే కొత్తగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ ఎందుకు రంగ ప్రవేశం చేస్తున్నది? అది నిజం కాకుంటే సుప్రీంకోర్టు విచారణ సమయంలో సిబిఐ న్యాయవాదిని చివరి నిముషంలో ఎందుకు మార్చారు? వైఎస్ విజయమ్మ ఢిల్లీకి వెళ్లి ఎవరిని కలిసి వచ్చారు? వైవి సుబ్బారెడ్డి అహ్మద్ పటేల్‌ను, దిగ్విజయ్‌సింగ్‌ను కలిసి ఏమి మాట్లాడాడు? షర్మిళ పాదయాత్రలో కానీ, విజయమ్మ ఉపన్యాసాలలో కానీ సోనియాగాంధీ ప్రస్తావన ఎందుకు రావడం లేదు? కిరణ్‌కుమార్‌రెడ్డిని మాత్రం తిట్టి వదలి పెట్టడంలో ఉద్దేశ్యం ఏమిటి? సాక్షి పత్రిక పూర్తిగా కాంగ్రెస్ మీద విమర్శలకు మానుకోవడానికి ప్రోద్బలం ఏమిటి?

ఎవరు అవునన్నా ఎవరు కాదన్నా ఈ రోజు రాష్ట్రంలో అత్యంత ప్రజాదరణ కల్గిన నాయకుడు, రాజకీయవాది వైఎస్ జగన్ మాత్రమే. తొమ్మిదేళ్లు అధికారంలో ఉన్న చంద్రబాబునాయుడు కంటే నాలుగు నెలలకు పైగా కారాగారంలో ప్రగ్గతున్న జగన్‌ను జనం ఎక్కువగా ఆదరిస్తున్నారు. అందువల్ల జగన్‌కు సంబంధించిన ప్రతి చిన్న అంశం కూడా విస్తృతస్థాయిలో చర్చకు నోచుకొంటున్నది. ఇప్పుడు జగన్ అభిమానులలో కానీ, వ్యతిరేకులలో కానీ జోరుగా నడుస్తున్న చర్చ జగన్ భవితవ్యం ఏమిటి అన్నదే. ఆయన జైలులో ఎంతకాలం ఉంటాడు, బెయిల్ ఎప్పటికి వస్తుంది, అసలు బెయిల్ వస్తుందా రాదా, బెయిల్ వచ్చేలోగా మొదట పెట్టిన కేసులలో తీర్పు వెలువడుతుందా అన్న ప్రశ్నలు ఎక్కువగా విన్పిస్తున్నాయి.

జగన్‌తో కాంగ్రెస్ పార్టీ లేదా కాంగ్రెస్‌తో జగన్ రాజీ పడ్డాడన్న వాదానికి సుప్రీంకోర్టు తీర్పు సమయంలో కొంత విశ్వసనీయత కన్పించినా ఇప్పుడు మాత్రం ఆ సూచనలు లేవు. సుప్రీంకోర్టు బెయిల్ విచారణకు ముందు కన్పించకుండా పోయిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ అధికారులు, ఆ తీర్పు తర్వాత మళ్లీ ప్రత్యక్షమౌతున్నారు. జగన్‌ను, విజయసాయిరెడ్డిని తరచి తరచి విచారించే ప్రక్రియను పునఃప్రారంభించారు. విజయసాయిరెడ్డి వద్ద లిఖిత పూర్వకంగా చాలా సమాచారమే సేకరించినట్లు వినికిడి. దాని ఆధారంగా జగన్‌ను విచారించడానికి ఆయన్ను ఢిల్లీకి తరలించవచ్చునని, తీహార్ జైలులో పెట్టవచ్చునని ఒక వదంతి విన్పిస్తున్నది. హైదరాబాదు జైలులో జగన్‌కు అన్ని సౌకర్యాలు సమకూరుస్తున్నారన్నది జగమెరిగిన సత్యం. ప్రత్యేక ఖైదీగా

కొరవ 14వ పేజీలో



ముందడుగు

ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక బిల్లుకు ఆమోదం తెలిపింది. దళిత అభ్యున్నతికి మన సమాజంలో జరుగుతున్న కృషిలో ఇదొక కీలకమైన మైలు రాయి. ఏడు దశాబ్దాల క్రితం, రాజ్యాంగ రూపకల్పన కోసం ఏర్పాటైన రాజ్యాంగ పరిషత్‌లో బిఆర్ అంబేద్కర్ తొలిసారిగా దళిత జనోద్ధారణ అంశాన్ని లేవనెత్తారు. తన మేధా సంపత్తి సమస్తాన్ని ప్రయోగించి ఆనాటి జాతి నేతలందరినీ ఒప్పించి రిజర్వేషన్ విధానాన్ని ప్రవేశ పెట్టించాడు. ఆ తర్వాత భారత దేశపు తొలి న్యాయమంత్రిగా దళితుల జీవితాలను బాగు చేయడం కోసం ఎన్నో చట్టాలు ఆమోదింప చేశాడు. కానీ దురదృష్టవశాత్తు ఆ సత్సంకల్పానికి శ్రీకారం చుట్టిన 67ఏళ్ల తర్వాత కూడా మన దేశంలో దళితుల జీవితాలు అంధకారంలోనే వున్నాయి. వారి పేరుతో వేలు, లక్షల కోట్ల రూపాయల నిధులను కేటాయిస్తున్నా వారి జీవితాలు మాత్రం మరింతగా అణగారి పోతున్నాయే తప్ప మెరుగు పడడం లేదు. ఇందుకు ప్రధాన కారణం – కేంద్ర, రాష్ట్రాల బడ్జెట్లలో దళితుల అభ్యున్నతి కోసం కేటాయిస్తున్న వేలు, లక్షల కోట్ల రూపాయల నిధులు ఖర్చుకాక పోవడం. ఇందుకు ప్రధానంగా రెండు కారణాలున్నాయి. మొదటిది – ప్రభుత్వాలు ఆ నిధులను ఇతర అవసరాలకు మళ్లించడం. రెండవది – దళితుల అభివృద్ధి పట్ల ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేకపోవడం. దళితుల కోసం బడ్జెట్‌లలో కేటాయించే నిధులను వారి కోసం మాత్రమే ఖర్చు చేయాలనే నియమం విధించాలనే ఆలోచన ముప్పయ్యేళ్ల క్రితం ఇందిరమ్మకు కల్గింది. ఆరవ ప్రణాళిక అమలులో భాగంగా ఆ మహా తల్లి, స్పెషల్ కాంపొనెన్ట్ ప్లాన్ అనే విధానాన్ని ప్రవేశపెట్టారు. ఆ తర్వాతికాలంలో దానికి ఎస్సీ సబ్ ప్లాన్ అని పేరు మార్చారు. ఇందిరమ్మ ఎంతో దూరదృష్టితో ఆ ఉప ప్రణాళిక విధానాన్ని ప్రవేశపెట్టినా ఆచరణలో అది అమలు కాలేదు. ఏదో ఒక నిర్భంధం వుంటే తప్ప ఇటువంటి నియమాలు ఆచరణకు నోచుకోవనే భావనతో రాహుల్ గాంధీ నేతృత్వంలోని నేషనల్ అడ్వయిజరీ కౌన్సిల్ 12వ ప్రణాళిక నిధుల ఖర్చుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ ఎస్టీ ఉప ప్రణాళికను చట్టబద్ధం చేయాలని సిఫార్సు చేసింది. దానికి అనుగుణంగానే కిరణ్‌కుమార్ రెడ్డి శాసనసభలో ఈ చట్టాన్ని ప్రవేశపెట్టి ఆమోదింప చేశాడు. ఈ కృషిలో ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ పాత్ర విస్మరించరానిది. ఉప ప్రణాళిక చట్టం కోసం ఆయన మంత్రివర్గ సమావేశాలలో ఒత్తిడి తెచ్చి, బిల్లు రూపంలో సభ ముందుకు తెప్పించడమే కాకుండా అన్ని పార్టీలూ దానికి ఆమోదం తెలిపేట్లు చేయడం కోసం ఎంతో శ్రమ పడ్డాడు. ఉప ప్రణాళిక అనే ప్రతిపాదన ఢిల్లీ నుంచే వచ్చినా, దేశంలోని ఇతర రాష్ట్రాలు, కేంద్రం కంటే ముందుగా దానికి చట్ట రూపం కల్పించిన ఘనత వీరిద్దరికే దక్కుతుంది.

అయితే ఎస్సీ ఎస్టీ అభ్యున్నతికి ఈ చట్టం ఒక మాంత్రికుడి చేతిలో దండం అని భ్రమ పడలేము. పేరుకు చట్టమైతే చేశారు కానీ దాన్ని పటిష్టంగా అమలు చేసే జాగ్రత్తలు మాత్రం తీసుకోలేదు. చట్టం ప్రకారం ఎస్సీ ఎస్టీలకు కేటాయించిన నిధులను ఖర్చు చేయకపోతే బాధ్యత ఎవరిది, అందుకు శిక్ష ఏమిటి అన్నదానిలో ఈ కొత్త చట్టం స్పష్టత ఇవ్వడం లేదు. ఇది వరకు వలెనే భవిష్యత్తు ప్రభుత్వాలు కూడా దళితుల కోసం కేటాయించిన నిధులను ఇతర కార్యక్రమాలకు మళ్లించరన్న హామీ ఏదీ లేదు. ఆ హామీ కావాలంటే చట్టంలో నిర్భంధం వుండాలి. దాని అమలుకు ప్రత్యేక యంత్రాంగం ఏర్పడాలి. వివిధ మంత్రిత్వ శాఖలు ఉప ప్రణాళిక నిధుల వ్యయాన్ని ఎట్లా జరుపుతున్నదీ ఆ ప్రత్యేక యంత్రాంగం అనుక్షణం కనిపెట్టి చూసి, దారి మళ్లుతున్నప్పుడు హెచ్చరికలు చేస్తే తప్ప చట్టం ప్రయోజనాలు దళితులకు పూర్తిగా అందుబాటులోకి రావు.

జమీన్‌రైతు

ఈ చట్టం ద్వారా రాజకీయ లాభం పండించుకోవాలని ఆశపడుతున్నాడు ముఖ్యమంత్రి. వైఎస్ జగన్ పక్షం చేరిపోయిన మాల కులం మొత్తం ఈ ఉప ప్రణాళిక ఫలితంగా తిరిగి కాంగ్రెస్ గూటికి చేరుతారని భ్రమపడుతున్నారాయన. ఇటువంటి సంచలనాత్మక నిర్ణయాలను అమలు చేసినప్పుడు వాటి ఫలితాన్ని అనుభవించాలని రాజకీయవాదులు ఆశించడంలో తప్పు లేదు. కానీ ఈ విషయంలో మాత్రం కాంగ్రెస్ వాదులకు ఆశాభంగం తప్పక పోవచ్చునన్పిస్తున్నది. దీనివల్ల రాజకీయ లాభం వున్నా లేకపోయినా దళితుల అభివృద్ధి కోసం జరిగే కృషిలో దీన్నొక పెద్ద ముందడుగుగా మాత్రం అభివర్ణించవచ్చు.

జనవాక్కు

జయహో స్వర్ణాంధ్రప్రదేశ్!

గుప్తుల కాలం స్వర్ణయుగమని చదువుకున్నాం. కృష్ణరాయల పాలనలో అంగట్లో కువ్వలుపోసి రత్నాలు అమ్మేవారని ప్రతీతి. అది పాతచరిత్ర. దేవుని దయవల్ల హఠాత్తుగా గత పదేండ్లలో రాష్ట్ర జాతకచక్రం మారి స్వర్ణాంధ్ర ప్రదేశ్‌గా వాసికెక్కడం ఓ కలియుగ మహాద్భుతం. ఈ నూతన స్వర్ణయుగ సృష్టి కర్తల చాతుర్యం పనితనం చూసి సాక్షాత్తు న్యాయమూర్తులే అవాక్కు కావడం నిష్టూరసత్యం. ఇక సామాన్య ప్రజానీకమైతే విస్తుపోయి బెల్లం చుట్టూ మూగిన ఈగల్లా స్వర్ణాంధ్ర కిశోరాలకు జేజేలు పలకడం నమ్మశక్యం కాని ఓ వాస్తవం. ఈ విచిత్ర క్రీడాభిరామంలో అసలుసిసలు కామందు సమీప భావిరాష్ట్ర సముద్ధరణ కంకణధారియై భారీ ప్రణాళికల రచనలో తలమున్కలై వుండగా (జైల్లో), ఎందరో భాగస్వామ్య దళపతులు, అధికార అనధికార సహచరులు శ్రీకృష్ణ జన్మస్థానాకికి సీజన్ టిక్కెట్లు పుచ్చుకొని రాకపోకలు దిగులు దిగులుగా సాగిస్తున్నారు. ఈ రాజసూయ యాగాన్ని సంపూర్తిగా విజయవంతం చేసేందుకు పాదయాత్రా దళం ఊరేగుతూ 'ఆమ్ ఆద్మీ' కష్టనష్టాలను ఏకరువు పెడుతూ జార్చే కన్నీటిధారలతో రాష్ట్రం తడచి ముద్దవుతున్నది. బంగారు లేడి మాయలోపడి మోసపోవడానికి జనం ఏమన్నా అమాయకులా అన్న ఆకాశవాణి పల్కులు ఉపన్యాసాలు గోలలో ఎవరూ వినిపించుకున్నట్లు లేదు.

ఎం.రామమూర్తి — విశాఖపట్నం

కేంద్ర మంత్రులు పని చేయాలి!

కేంద్ర మంత్రులుగా రాష్ట్రానికి చెందిన పదిమంది ఎమ్పీలు బాధ్యతలు చేపట్టడం ఆనందకరం. ఇంతవరకు బాధ్యతలు నిర్వహించిన కేంద్ర మంత్రులు రాష్ట్రాభివృద్ధిపై దృష్టే పెట్టలేదు. రైల్వేశాఖ సహాయ మంత్రిగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి నియమితులయ్యారు. జిల్లాకు చెందిన పెట్రోలియంశాఖ సహాయ మంత్రి పనబాక లక్ష్మి ఆయన్ను ఒప్పించి ఏదో ఒక రైల్వే ప్రాజెక్టు బిట్రగుంటకు తీసుకొచ్చే ప్రయత్నం చేయాలి. ఇఫ్కో కిసాన్ సెజ్ పనులు కదలిక పట్ల కూడా పనబాక లక్ష్మి శ్రద్ధ తీసుకోవాలి. దీని కోసం నెల్లూరీయులైన ఎమ్పీల సహకారం ఆమె తీసుకోమనవి.

నలబోలు రామ్మోహన్‌రెడ్డి — చెన్నై

దుస్థితిలో హోమియో కళాశాలలు!

రాష్ట్రంలో నాలుగు హోమియో కళాశాలలున్నాయి. వీటిలో 70కిపైగా లెక్చరర్లు, సహాయ ప్రొఫెసర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని ప్రభుత్వం భర్తీ చేసే ప్రయత్నం చేయడం లేదు. డెంగ్యూ, చికెన్‌గున్యా తదితర భయంకర రుగ్మతలకు రామబాణంలా పనిచేసే హోమియో మందుల ప్రాముఖ్యం జగద్విదితం. హోమియో వైద్య పోస్టుల భర్తీ తక్షణం ప్రభుత్వం చేపట్టాలి. హోమియో విద్యా

కొరవ 14వ పేజీలో

70 ఏళ్ల క్రితం ఈవారం

18-12-1942
పేజీలు : 10 వెల: అణా

నెల్లూరు ముచ్చట్లు
నామినేషన్లు

చుండూరు సుబ్బయ్య రావుసాహెబ్ గూడా మునిసిపల్ కేదారక్షేత్రాన్ని రెడ్‌క్రాస్ నాగలితో ఒక సాలు దున్ని నాలుగు గింజలు చల్లి చూచాడు. అవేమీ మొలవలేదు. లత్సయ్య అంటే రూకబలం, మూక బలం కలవాడు. అదీగాక బ్యాంకు ప్రెసిడెంటు పోటీ నుండి తప్పించవలసి ఉన్నది. అందువల్ల లత్సయ్య చేసే కృషే ఫలిస్తుందని అంటున్నారు.

మునిసిపల్ సభ్యులు యెవరుగా ఉంటారు అనేది వచ్చే మాటు ఊహాగానం చేద్దాం.

ఇక జిల్లా బోర్డు విషయాలు :– వెంకటగిరి విషయమేమీ మన ఊహకందడం లేదు. రాజాగారి కిందులో ఏమీ దురద లేదు. రామన్న గీమన్నల శకం అంతరించింది. గోయిందయ్యలు విధి లేకుండా వార్ని బాధిస్తే తప్ప లేకుంటే ఈ విషయంలో వారేమీ జోక్యం బుచ్చుకోరనే మనమనుకోవచ్చు.

హరిజనుల విషయం వూహకంద లేదు. మహమ్మదీయ స్థానం సలాం సాహెబ్, హాజీ మహబూబ్ ఖాన్ గార్లతో ఉంటుంది. క్రైస్తవ స్థానం బహుశా పున్నయ్య గారిని వూహించవచ్చు.

ప్రెసిడెంటు విషయం గోవిందరెడ్డి గారిదే. సందేహం లేదు. ఇహ వైస్ ప్రెసిడెంటు విషయం ముందుగా నిర్ధారణ కాదు. కందుకూరు మాత్రం పోదు. ఏమంటే ఇదివరకొచ్చిన నిందే చాలు తరతరాల వరకు గోయిందయ్యకు. కావలి విషయం రెండూ బావమరుదులకేనా అని అంటారని సందేహపడొచ్చు. నెల్లూరు అంటే చక్కెర రెడ్డా? బి.ఎ.రెడ్డా అని సందేహం?

50 ఏళ్ల క్రితం ఈవారం

14-12-1962
పేజీలు: 12 వెల: 0-20 న.పై

ఎంత దరిద్రుడు నిజాం!

కేంద్రం తమకు చెల్లించే భరణాల్లో నూటికి పది వంతులు రక్షణ నిధికి ఇవ్వవలసిందిగా మాజీ సంస్థానాదీశులకు ప్రభుత్వం విజ్ఞప్తిజేస్తూ వ్రాయగా, ఏటా 50 లక్షలు పుచ్చుకునే నిజాం నవాబు యిలా జవాబిచ్చారు. "నేను చాలా పేదవాణ్ణి, నా భరణం నుండి రక్షణ నిధికి యివ్వలేను". ఎంత దరిద్రుడండీ ప్రపంచ కుబేరుడైన ఈ నిజాం నవాబు! చెరుకును బెల్లం పెట్టమంటే పెడుతుందా?

నెల్లూరు ముచ్చట్లు
స్టేట్ బ్యాంక్‌లో చోరీ

నెల్లూరు స్టేట్ బ్యాంక్‌లో 13వ తేది మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్‌కు చెందిన రూ.4,700ల విలువగల 47 వంద రూపాయల నోట్లు తస్కరింపబడినవి.

ఎల్ఐసి జవాను బి.గురవయ్య ఆఫీసులో రూ.7,552-40 లెక్కబెట్టి, సంతకంజేసి తీసుకొని స్టేట్ బ్యాంక్‌లో కట్టుటకు పోయాడని, ఆ మొత్తంలో 47 వంద రూపాయల నోట్లుండినవని; గురవయ్య ముందు కొన్ని చెక్కులు ఆ కౌంటరులో యిచ్చి. డబ్బు కట్టుటకు క్యాష్ కౌంటరు దగ్గరకు వచ్చాడని, ఇంతలోగా హెడ్ క్యాషియర్ వద్దకు ఇంకొక కౌంటరులోని క్యాషియర్ వచ్చి 500 రూపాయలకు ఐదు రూపాయల నోట్లు అడిగాడని, హెడ్ క్యాషియరు గురవయ్యతో అతని వద్ద ఉన్న ఐదు రూపాయల కట్ట యివ్వమన్నాడని, గురవయ్య ఆ ప్రకారమే ఐదు రూపాయల నోట్ల కట్ట యిచ్చి వంద కాగితాలు ఐదుకు బదులు తీసుకొన్నాడు. ఇంతలో ఒక వ్యక్తి గురవయ్య కాళ్ల వద్ద రెండు ఐదు రూపాయల కాగితాలు పడి ఉన్నాయని చెప్పగా అతను వంగడం పైన పెట్టిన డబ్బు మాయమై పోవడం జరిగింది. స్టేట్ బ్యాంక్‌లో చోరీ జరగడం చర్చనీయాంశమయ్యింది.

నెల్లూరు ముచ్చట్లు

విశ్రాంతిలో వివేకా

నెల్లూరులో రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి హైదరాబాదులోని స్టార్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. తుంటి దగ్గర ఒక ఎముకలో సన్నటి పగులు వున్నందువల్ల కనీసం 20 రోజులపాటు కాలు కదిలించకుండా మంచం మీదనే విశ్రాంతి తీసుకోవాలని డాక్టర్లు సలహా ఇచ్చారట. ఆర్థికమంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఇంట్లో ఆ సలహా ప్రకారం విశ్రాంతి తీసుకొంటున్నాడు వివేకా.

ఇదిట్లా వుంటే ఆయన మరికొంత కాలం నెల్లూరు వచ్చి, చురుకుగా రాజకీయాలలో పాలు పంచుకొనే అవకాశం లేదు కాబట్టి, ఆయన తరపున ఎమ్మెల్యేగా వ్యవహరించే అధికారాన్ని ఆయన తమ్ముడు ఆనం విజయకుమార్‌రెడ్డికి అప్ప చెప్పాడు ఆర్థికమంత్రి. నెల్లూరు మునిసిపల్ వ్యవహారాలను కూడా దఖలు పరచాడు. దానితో విజయకుమార్‌రెడ్డి అనధికార ఎమ్మెల్యేగా అన్ని పనులూ చక్కబెడుతున్నాడు.

రామనారాయణ ఉక్కిరి బిక్కిరి!

వివేకానందరెడ్డి అస్వస్థుడు కావడం, ఆయన చేసే కార్యక్రమాలన్నీ తాను చేయాల్సి రావడంతో ఆర్థిక మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఉక్కిరి బిక్కిరి అవుతున్నట్లు తెలిసింది. గల్లీల్లోని సిల్లీ రాజకీయం నుంచి పెద్ద పెద్ద బాధ్యతలు నిర్వహించడంలో వివేకా నేర్పరి కావడంతో ఆ పనులన్నీ తాను చేయలేక, మాసం రోజులుగా మంత్రి చాలా ఆందోళనగా కన్పిస్తున్నట్లు సన్నిహితులు చెబుతున్నారు.

కాకాణిని తిట్టిన ఉదయగిరి ఎమ్మెల్యే!

సహకార ఎన్నికల నేపథ్యంలో నెల్లూరు ఎమ్పీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి గెస్ట్‌హౌస్‌లో పార్టీ ముఖ్యులతో 9వ తేది ఏర్పాటుచేసిన సమావేశానికి ముందు వైకాపా జిల్లా కన్వీనర్, జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ అయిన కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి బండ బూతులు తిట్టడం చర్చకు దారి తీసింది. ఈ విషయం కాకాణి చెవికి సోకడంతో ఇక నుంచి పార్టీ సమావేశాలన్నీ కలెక్టర్ బంగళా ప్రక్కనున్న వైకాపా జిల్లా కార్యాలయంలోనే జరుగుతాయని, ఎవరి గెస్ట్ హౌస్‌లలో జరగవని గోవర్ధన్‌రెడ్డి తేల్చి చెప్పినట్లు పోబిడి. ఇంతకూ కాకాణిని మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఎందుకు తిట్టాడన్న అంశంపై రాజకీయ వర్గాల్లో వాడివేడి చర్చ జరుగుతుంది.

డబ్బున్న వాళ్లే పోటీ చేయాలి!

సహకార సంఘాల ఎన్నికల ప్రక్రియ అధిగమించాలంటే వైకాపా తరపున పోటీచేసే అభ్యర్థులు తప్పనిసరిగా మంచి ఆర్థిక స్థోమత కలిగి ఉండాలని నెల్లూరు ఎమ్పీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. 9వ తేది దర్గామిట్టలోని తన గెస్ట్‌హౌస్‌లో వైకాపా జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు, మండల కన్వీనర్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల నాయకులు సహకార సంఘ ఎన్నికలకు సమాయత్తం కావాలి. జీవన్మరణ సమస్యలాంటి ఈ ఎన్నికల్లో డబ్బున్న వాళ్లే పోటీ చేయాలనడం పార్టీలో విస్తృత చర్చకు దారితీసింది. డబ్బున్న వాళ్లే పోటీ చేయాలన్న ఆంక్ష విధించడానికి మేకపాటి ఎవరని అందరూ గుసగుసలాడినా ఈ విషయాన్ని ఖండిస్తూ ఎవరూ మాట్లాడకపోవడం విశేషం.

పోలీసులపై తీవ్ర విమర్శ!

నెల్లూరు నగరంతోపాటు కావలి, గూడూరు పట్టణాల్లో గత మూడు నెలలుగా ఆగకుండా జరుగుతున్న దొంగతనాలను అరికట్టడంలో పోలీసులు విఫలమవ్వడం పట్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్నది. ఎస్పీ బివి రమణకుమార్ వ్యక్తిగతంగా మంచి అధికారి అయినా ఆయన క్రిందిస్థాయి అధికారులను గదమాయించి పనిచేయించలేక పోతున్నారన్న విమర్శ బయలుదేరింది. దీనిని పోగొట్టాలంటే దొంగతనాలు జరుగకుండా ఎస్పీగారు ప్రతిరోజూ సమీక్షలు, క్షేత్రస్థాయి పర్యటనలు చేయక తప్పదు.

చోరీలపై గవర్నర్‌కు లేఖ

జిల్లాలో వరుస దొంగతనాలపై గవర్నర్ నరసింహన్‌కు బిజెపి నేత మిడతల రమేష్ లేఖ వ్రాశారు. దొంగ తనాలతో ప్రజలు స్వేచ్ఛగా బతకలేని పరిస్థితి నెలకొనిందని ఆ లేఖలో స్పష్టం చేశారు. గవర్నర్ చొరవ తీసుకుని పరిస్థితులు సరిదిద్దేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పాపం... అబ్దుల్ అజీజ్ భాయ్!

వైకాపాలో చురుకైన భూమిక నిర్వహిస్తుండిన మైనార్టీ నాయకుడు హాజీ అబ్దుల్ అజీజ్‌ను స్వంత పార్టీ నేతలే వంచించారన్న విషయమై ఆ పార్టీలో చర్చ జరుగుతుంది. జిల్లాలో వైకాపా బాధ్యతలన్నీ చూసే అగ్రనేత కుమారుడు అజీజ్ దగ్గర పెద్ద మొత్తం తీసుకొని తిరిగి దాన్ని సర్దకపోవడంతో భాయ్ గందర గోళానికి లోనయ్యారంటున్నారు. కానీ ఈ విషయం బహిరంగంగా చెప్పుకొనేది కాక పోవడంతో ఆయన గత మూడు నెలలుగా పార్టీ కార్యకలాపాలకు కూడా దూరంగా ఉంటున్నారు.

చందాదారులకు మనవి

- చందా పంపించేటప్పుడు తమ చందా నెంబరు, పూర్తి పేరు, చిరునామా తెలియపరచండి.
- మీ చందా నెంబరు, చందా ఏ తేదికి అయిపోతుందో, అడ్రసు రేపరు మీదనే ముద్రించి వుంటుంది.
- 'జమీన్‌రైతు' చందాదార్లు తమ చందాను ఎం.ఓ/డి.డి లేదా Onlineలో ఆంధ్రాబ్యాంక్, విఆర్‌కాలేజి బ్రాంచి, నెల్లూరు అకౌంట్ నెంబర్: 106811011000423లో ZAMINRYOT పేరుతో జమచేయవచ్చు. సకాలంలో చందా చెల్లించవలసినదిగా కోరుతున్నాము.
- చెక్కులు స్వీకరించబడవు.

జీవిత చందా రూ.1000/-

సంవత్సర చందా

స్వదేశంలో రూ.200/-

విదేశాలకు రూ.1000/-

జమీన్‌రైతు

పాగతోట, నెల్లూరు - 524 001

ఫోన్: 0861 - 2327354

సెల్: 98489 66190

ఉద్యమ పథం

నెల్లూరు నగరంతోపాటు జిల్లాలో పెచ్చు పెరిగిన దొంగతనాలను పోలీసులు అరికట్టకుంటే ఉద్యమించక తప్పదని తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో స్పష్టం చేశారు. 8వ తేది పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ దొంగతనాలకు ప్రజలు హడలి పోతున్నారు. రౌడీయిజం సైతం పెరిగింది. గతంలో ఎస్పీగా పనిచేసిన శ్రీనివాసరెడ్డి రౌడీలు, దొంగలకు ముచ్చెమటలు పట్టించారు. ఇప్పటి ఎస్పీ కూడా ఇదే బాట నడవకుంటే ఈ విషయమై వీధుల్లోకి వచ్చి పోరాడేందుకు తెలుగుదేశం పార్టీ సిద్ధంగా ఉందన్నారు.

మరో సమ్మర్ స్టోరేజి ట్యాంకు!

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని ప్రజల దాహార్తి తీర్చను చెరువులో మరో సమ్మర్ స్టోరేజి ట్యాంకు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఆర్థిక మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. 9వ తేది కొత్తూరులో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దీని కోసం 150 కోట్ల రూపాయలు విడుదల చేయను ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. నెల్లూరు చెరువులో గతంలో పనులు ప్రారంభమైన సమ్మర్ స్టోరేజి ట్యాంకు నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. మళ్లీ ఈ కొత్త ట్యాంక్ ఏ వైపు కడతారు. నెల్లూరు చెరువును సమ్మర్ స్టోరేజీల నిలయం చేస్తే నీళ్ల పారుదల ఎలా? ఇప్పటికే గబ్బునీళ్ల చెరువుగా నెల్లూరు చెరువు తయారయ్యిందన్న విషయం మంత్రిగారికి తెలియదా?

సింహపురి సంస్కృతి సమాఖ్య వార్షికోత్సవం

సింహపురి సంస్కృతి సమాఖ్య 17 వార్షికోత్సవం 16వ తేది సాయంత్రం కస్తూరిబా కళాక్షేత్రంలో జరుగుతుంది. ఈ సందర్భంగా జరిగే సభకు నెల్లూరు ఎమ్పీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేస్తారు. సభకు సర్వేపల్లి ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షత వహిస్తారు. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సభను ప్రారంభిస్తారు. జడ్పీ ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేస్తారు. జమీన్‌రైతు సంపాదకుడు నెల్లూరు డోలేంద్రప్రసాద్ ఆత్మీయ అతిథిగా విచ్చేస్తారు. నెల్లూరు జాయింట్ సబ్ రిజిస్ట్రార్ – 1గా ఇటీవల పదవీ విరమణ చేసిన పూడి నరేంద్రరావును ఈ సందర్భంగా సత్కరిస్తారు. కలెక్టర్ బి.శ్రీధర్‌రెడ్డి, ఎస్పీ బివి రమణకుమార్, జాయింట్ కలెక్టర్ లక్ష్మీకాంతం, డిఆర్వో బి.రామిరెడ్డి, డిఆర్‌డిఏ పిడి వి.వెంకట సుబ్బయ్య, డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ జనరల్, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ కె.సత్యనారాయణ గౌరవ అతిథులుగా విచ్చేస్తారు.

ఈ సందర్భంగా వెంకటేష్, బాల కృష్ణ, నాగార్జున, కృష్ణ, పవన్‌కళ్యాణ్ సినీ డూప్ హీరోల నృత్య ప్రదర్శన, కళాంజలి శ్రీనివాస చక్రవర్తి సినీ సంగీత విభావరి, రాంజీ నృత్యేంద్రజాలం, బీరంగుంట శ్రీనివాసులు మిమిక్రీ ప్రదర్శనలుంటాయి. నెల్లూరీయులందరినీ ఈ కార్యక్రమానికి తరలి రమ్మంటున్నాడు నిర్వాహకుడు రాంజీ.

సిసిఎస్ లేఅవుట్‌లో పార్కు ఆక్రమణకు యత్నం!

నెల్లూరు దర్గామిట్టలోని ఎల్ఐసి ఆఫీసు ఎదురుగా ఉన్న సిసిఎస్ లేఅవుట్‌లోని పార్కులో అక్రమ నిర్మాణానికి నగరంలో తిరుగులేని మహిళా నేత ప్రయత్నించగా స్థానికులు అడ్డు కోవడం చర్చనీయాంశమయ్యింది. 1983లో ఈ లేఅవుట్‌ను సిసి సుబ్బరాయుడు ఏర్పాటు చేశారు. ఇక్కడి పార్కులో పొదుపులక్ష్మి గ్రూపు మీటింగ్ బిల్డింగ్ నిర్మాణానికి నగర మహిళా నేత అనుంగు అనుచరుడు అమానుల్లాఖాన్ కాంట్రాక్ట్ పొందాడు. 11వ తేది నిర్మాణం మొదలుపెట్టే ప్రయత్నం చేశాడు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం పార్కుల్లో ఎటువంటి శాశ్వత కట్టడాలు నిర్మించకూడదు. కానీ కార్పొరేషన్ ఇక్కడ భవన నిర్మాణానికి ఏ విధంగా నిధులు మంజూరు చేసిందో అర్థమే కావడం లేదు. స్థానికులు ఈ నిర్మాణాన్ని అడ్డుకోవడాన్ని మహిళా నేత జీర్ణించుకోలేకున్నారట. అంతిమంగా ఏం జరుగుతుందనేది ఎదురు చూడాల్సిందే.

నెల్లూరులో గాలి

తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత గాలి ముద్దుకృష్ణమనాయుడు 8వ తేది నెల్లూరుకు వచ్చారు. పార్టీ ఆఫీసులో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో 17వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకొన్నారన్నారు. ఈ విషయాన్ని పార్లమెంటులో వ్యవసాయ మంత్రి శరద్‌పవార్ సైతం ఒప్పుకొన్నారని, ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో ఎరువులు, విత్తనాలు, విద్యుత్ ఛార్జీలు పెంచడాన్ని తప్పుపట్టారు. ప్రకృతి వైపరీత్యాల్లో నష్టపోయిన రైతులను ఆదుకొనే తీరిక కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని గాలి దుయ్యబట్టారు. ఈ సమా

కొరవ 14వ పేజీలో







మరో రెండేళ్లు విద్యుత్ బిల్లుల వాయింపే!

ఈ బిల్లుల చెల్లింపు కష్టమే!



ఈ నెల బిల్లులో వడ్డించిన ఎఫ్ఎస్ఏ వివరం

నాణ్యమైన విద్యుత్‌ను ప్రజలకు అందించడంలో అధఃపాతాళ ప్రమాణాలతో నడుస్తున్న ఎపిఎస్ పిడిసిఎల్ విద్యుత్ బిల్లుల పెంపులో మాత్రం దేశంలోనే అగ్ర గామి సంస్థగా వెలుగొందుతుంది. ఈ నెల విద్యుత్ బిల్లుతో పాటు యూనిట్‌కు వడ్డించిన 1.32 పైసల ఎఫ్ఎస్ఏ టారి ఫ్‌ను 2014 జనవరి నెల వరకు కొనసాగించాలని రహస్య సర్క్యులర్ విడుదల చేసింది. డిశంబర్ నెలలో 125 యూనిట్లు దామాషాగా కాల్చిన విద్యుత్ వినియోగదారునికి మామూ లుగా 350 రూపాయలు బిల్లు వస్తుంది. ఈ మొత్తానికి యూనిట్‌కు రూపాయి 32 పైసల వంతున ఎఫ్ఎన్ఏ వడ్డిం చడంతో బిల్లు 1034 రూపాయలయ్యింది. దీనిలోనే కస్టమర్ ఛార్జీలు, విద్యుత్ సుంకాలు కలిపేశారు. బిల్లులో ఏ విభా గంలో ఎంత ఛార్జి వేశారనే వివరాలు సైతం లేవు. గందర గోళపు బిల్లుల వ్యవహారమై సంప్రదించమని బిల్లులో ఇచ్చి ఉన్న ఫోన్ నెంబర్లు 2348461, 2348462 అవుట్ ఆఫ్ సర్వీస్‌లో ఉన్నాయి. ప్రజలు తమ సమస్యలను ఇక ఎవరికి చెప్పుకోవాలి. ఎలా పరిష్కరించుకోవాలి? విద్యుత్ శాఖాధికా రులకు జారీచేసిన రహస్య సర్క్యులర్‌లో ఎఫ్ఎస్ఏ వడ్డింపుల వివరాలు ఇలా ఉన్నాయి.

2010 సంవత్సరం ఏప్రెల్, జూన్ నెలల్లో వాడుకొన్న కరెంట్‌కు యూనిట్‌కు 15.13 పైసల ఎఫ్ఎస్ఏ వసూలు చేస్తారు. జూన్, సెప్టెంబర్ నెలల మధ్య వాడుకొన్న విద్యుత్‌కు 14.22 పైసలు ఎఫ్ఎస్ఏ 2013 జనవరి మార్చి మధ్య వచ్చే బిల్లుల్లో వడ్డిస్తారు. అక్టోబర్ నుంచి డిశంబర్ నెలల్లో వాడిన విద్యుత్‌కు 29.41 పైసల ఎఫ్ఎస్ఏను ఏప్రెల్ 2013 జూన్ నెలల్లో వచ్చే బిల్లుల్లో వేస్తారు. జనవరి 2011 నుంచి మార్చి వరకు వాడుకొన్న కరెంట్‌కుగాను యూనిట్‌కు 122.39 పైసల ఎఫ్ఎస్ఏ 2013 జూన్, జులై, సెప్టెంబర్ నెలల్లో ఇచ్చే విద్యుత్ బిల్లుల్లో వడ్డిస్తారు. ఏప్రెల్ జూన్ నెలల్లో వాడుకొన్న విద్యు త్‌కు 32.58 పైసల వంతున ఎఫ్ఎస్ఏను 2013 అక్టోబర్, నవంబర్, డిశంబర్ నెలల్లో ఇచ్చే బిల్లుల్లో వేస్తారు. జూలై, ఆగష్టు, సెప్టెంబర్ నెలల్లో వాడుకొన్న విద్యుత్‌కు 103.48 పైసల ఎఫ్ఎస్ఏను 2014 జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఇచ్చే విద్యుత్ బిల్లుల్లో వడ్డిస్తారు. అక్టోబర్, నవంబర్, డిశం బర్ నెలల్లో వాడుకొన్న విద్యుత్‌కు 94.87 పైసల ఎఫ్ఎస్ ఏను 2014 ఏప్రెల్, మే, జూన్ నెలల్లో ఇచ్చే విద్యుత్ బిల్లుల్లో వేస్తారు. 2012 జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు వాడిన విద్యుత్‌కుగాను 94 పైసల ఎఫ్ఎస్ఏను 2014 సంవత్సరం జూలై, ఆగష్టు, సెప్టెంబర్ నెలల్లో వచ్చే విద్యుత్ బిల్లుల్లో వేస్తారు. 2012 జూలై, సెప్టెంబర్ నెలల్లో వాడిన విద్యుత్ గాను ఎంత ఎఫ్ఎస్ఏ వేయాలన్న విషయాన్ని మాత్రం మళ్లీ చెబుతామని విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు తామిచ్చిన రహస్య సర్క్యులర్ చెప్పడం విశేషం. ఎఫ్ఎస్ఏ వడ్డింపుల మూలంగా ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెల్లుబుకుతుంది. దీనికి మూల్యాన్ని కిరణ్‌కుమార్‌రెడ్డి సర్కార్ చెల్లించక తప్పదు.

బాల కార్మికులకు స్వేచ్ఛలేదా?

బాల కార్మికులందరినీ బడిలో చేర్పించామని, ఆర్‌బిసిలలో చేర్పించామని, అందరికీ చదువు చెప్పిస్తున్నామని కాకి లెక్కలు చెప్పే అధికారుల మాటలు పచ్చి అబద్ధాలనే రుజువు అవుతున్నాయి. అప్పుల ఊబిలో కూరుకుపోవడమో, ఇతరత్రా కారణాలు ఏవైనప్పటికీ వం దల సంఖ్యలో చిన్నారులు బాలకార్మికులుగా ఉన్నారన్నది నిజం. నెల్లూరు నగరంతోపాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో హోటళ్లు, డాబాలు, టీ అంగళ్లలో చిన్నారులు పనిచేస్తున్నారు. నిత్యం కార్లలో తిరిగే అధికారులకు వీరు కన్పడుతుంటారు. అయినా బాల కార్మికులు లేరని రాజీవ్ విద్యామిషన్, కార్మికశాఖ, ఇతర అధికారులు ప్రకటనలు ఇస్తుంటారు. ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం రూపొందించినపుడో, వీరికి తీరుబడి దొరికినపుడో హడావుడిగా నాలుగు అంగళ్లపై దాడులు నిర్వహించి బాల కార్మికులను గుర్తించామని చెప్పి ఫోటోలకు ఫోజులిచ్చి ఘనకార్యం చేసినట్లు భావిస్తుంటారు. కానీ ఇలాంటి వారు చేసే కార్యక్రమాలన్నీ బోగస్ అని ఇటీవల డాబాలో పనిచేస్తూ హత్యకు గురైన గిరిజన బాలుడు వెంకటేశ్వర్లు రుజువు చేశాడు. తల్లితండ్రులు చేసిన అప్పుకు బడికిపోయి చదువుకోవాల్సిన ఆ చిన్నారి బాలుడు బాల కార్మికుడిగా మారి చిత్రహింసలకు గురై మరణించాడు. ఈ ఘటన బాల కార్మికుల పరిస్థితికి అద్దం పట్టింది. ఇంత జరిగినా అధికారుల్లో చలనం రాకపోవడం పట్ల విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పాడిందే పాడరా అన్నట్లు బడిమానేసిన పిల్లలను, బాల కార్మికులను అందరినీ పాఠశాలల్లో చేర్పించి విద్యాబుద్ధులు చెప్పిస్తున్నారని చెప్పి చంకలు గుద్దుకునే ఆయా శాఖల అధికారులు దీనికి ఏం సమాధానమిస్తారో? జిల్లాలో వివిధ ప్రాంతాల్లో బాల కార్మికులు ఉన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం చుట్టుప్రక్కల పరిశీలిస్తే పలకా బలపం పట్టాల్సిన చిట్టి చేతులతో వెల్డింగ్ షాపులు, హోటళ్లు, టీ అంగళ్లలో వివిధ పనులు చేస్తున్న బాలలు ఎందరో తారసపడుతారు.


మాజీ డిపిఆర్వో ఎం.వెంకటరత్నం కుమారుడు వెంకటకళ్యాణ్, పవనకృష్ణ ప్రవంతిల వివాహం నవంబర్ 29వ తేది ఒంగోలు శంకరనారాయణ కళ్యాణ మండపంలో జరిగింది.

ట్రాఫిక్ పోలీసుల అతి!

✦ లంచాల వసూళ్లే లక్ష్యం

ట్రాఫిక్ పోలీసుల వ్యవహారశైలి ప్రజల పాలిట శాపంగా పరిణమిస్తోంది. ఒంటిపై ఖాకీ యూనిఫాం ఉంది కదా తాము ఏంచేసినా చెల్లుబాటు అవుతుందన్న అహంకా రంతో మితిమీరి ప్రవర్తిస్తుండడంతో వాహనాలు నడిపేవారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని సమయాల్లో ప్రమాదా లకు గురౌతున్నారు. ట్రాఫిక్ నియమాలు పాటించని వారిని, అడ్డదిడ్డంగా, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని నిలిపి అపరాధరుసుం కట్టించుకోవాల్సిందే. అయితే వాహనాలు నిలిపే సందర్భాలలో పోలీసులు, హోంగార్డులు, ఎస్ఐ, సిఐల జీపు డ్రైవర్లు దుందుడుకుతనంతో వ్యవహరిస్తుండడంపై విమ ర్శలు వ్యక్తం అవుతున్నాయి. సంబంధిత వ్యక్తులు వాహనాలు నిలిపేలోగానే బైక్‌లు, స్కూటర్ల నుంచి తాళాలు లాగేస్తుండడం, వాహనాలను నిలపకుండాపోతారని భావించి ఆయా వ్యక్తుల చొక్కాలు పట్టుకొని లాగుతుండడంతో వాహనాలు పట్టు తప్పి పలువురు గాయాల పాలవుతున్నారు. వాహనాలు నడిపే వ్యక్తి తోపాటు దానిపై వస్తున్న కుటుంబ సభ్యులు, పిల్లలు క్రిందప డిన ఘటనలు కోకొల్లలు. ఇలాంటి వాటికి పాల్పడమని పోలీస్ నిబంధనల్లో ఉందా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. అమర్యాద కరంగా, నేరస్తులతో వ్యవహరించే తీరులో ట్రాఫిక్ పోలీసులు అతిగా వ్యవహరిస్తుండడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు. ఇటీవల వేదాయపాళెం సెంటర్‌లో ఇరువురు యువ కులు పోలీసులు వాహనాన్ని తనిఖీ చేయబోగా స్పీడుగా నడిపి కానిస్టేబుల్‌ను గుద్దేశాడు. ఆ ఘటనలో పోలీస్‌కు తీవ్రగాయా లయ్యాయి. ఈ ఘటనపై స్పందించిన పోలీస్ ఉన్నతాధికారులు సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. అంతవరకు బాగానే ఉన్నా నిత్యం రోడ్లపై వలవేసి ఉంటున్న ట్రాఫిక్ పోలీ సులు వాహనాలపై వెళ్తున్న వారి నుంచి తాళాలు లాగేస్తూ వారు పడిపోయేందుకు కారణమవుతున్నారు. మరి ఇలాంటి వారిపై ఎవరు కేసులు పెట్టాలి, దీనికి ఎవరు బాధ్యత వహిస్తా రని నగరవాసులు ప్రశ్నిస్తున్నారు. దీనికి పోలీస్ అధికారులు ఏం సమాధానం చెప్తారో?


రోడ్లపై ట్రాఫిక్ పోలీసుల బలవంతపు తనిఖీ.

ప్రభుత్వ పాఠశాలలో పరీక్ష ఫీజుల వసూళ్లు!

ఈ నెల 27 తేది నుంచి జరగబోయే అర్ధ సంవత్సరాది పరీక్షల నిర్వహణకు విద్యార్థుల నుంచి ఫీజు వసూళ్లు చేస్తు న్నారు. ప్రశ్నాపత్రాలు ముద్రించాలన్న కారణంతో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు ఫీజులు గుంజుతున్నారు. మూడు నెలల పరీక్షలు, అర్ధ సంవత్సరాది, వార్షిక పరీక్షల ప్రశ్నాపత్రాల ముద్రణకు ప్రైవేటు పాఠశాలలు విద్యార్థుల నుంచి అవసరమైన ఫీజులు వసూళ్లు చేయడం ఆనవాయితీ. అయితే ప్రభుత్వ పాఠశాలలో ఇదేవిధానాన్ని అవలంభించడం చర్చనీ యాంశంగా మారింది. ఆరు నుంచి పదవ తరగతి వరకు 60 రూపాయలు, కింది తరగతులకు 30 రూపాయలు ప్రశ్నాప త్రాల ముద్రణకు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు ప్రశ్నాపత్రాల ముద్రణకు సంబంధించి విద్యాశాఖ నిధులు కేటా యిస్తుంది. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావడంలే దంటూ ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు. జిల్లా విద్యాశాఖ ఫీజుల వసూళ్లపై స్పందించడం లేదు. ఫీజులు చెల్లిస్తేనే పరీక్షలకు అనుమతిస్తామని విద్యార్థులను భయపెడుతున్నారు. ప్రధానంగా ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటున్న పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు పరీక్ష ఫీజు చెల్లించడం భారంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.



కాంగ్రెస్ పార్టీకి ఓటమి భయం!

● వైకాపా జిల్లా కన్వీనరల్ కాకాణి ఎద్దేవా!

స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలంటే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఓటమి భయం పట్టుకొందని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కన్వీనర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. సకాలంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరపని కారణంగా కేంద్రం నుంచి వస్తున్న దాదాపు నాలుగు వేల కోట్ల రూపాయల నిధులకు గండిపడుతోందని తెలిపారు. ఇటీవల ఆయన సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలోని తోటపల్లి గూడూరు మండలంలో పర్యటించారు. స్థానికంగా వుండే పార్టీ కార్యాలయానికి చేరుకొని విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని ఓటమి భయం వెన్నాడుతోందని ఆ కారణంగా ఇప్పట్లో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగవన్నారు. సామాన్య ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా మంత్రి, ప్రజాప్రతినిధులకు పట్టడం లేదన్నారు. ఆనాడు చెన్నైకి కండలేరు జలాశయం నుంచి నీరు వదిలితే తుపాకితో కాల్చుకొంటానని బెదరించిన నేతలు ప్రస్తుతం మాట మార్చారని మంత్రి ఆనంపై పరోక్ష విమర్శలు గుప్పించారు. షర్మిళ పాదయాత్ర ధాటికి చంద్రబాబునాయుడు పాదాలు కదలడం లేదని ఎద్దేవా చేశారు. జగన్‌ను జైల్లో ఉంచినంత మాత్రాన పార్టీ బలహీన పడుతుందన్న కోరికతో పాలకులు వున్నారని, అది కేవలం వారి భ్రమేనన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా జిల్లాలో 10 అసెంబ్లీ స్థానాలు, ఎమ్పీ సీట్లు వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీ గెలుచుకొంటుందన్న ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు మరింత దగ్గరయ్యేందుకు, వారి సమస్యలు తెలుసుకొనేందుకే పాదయాత్రకు స్వీకారం చుడుతున్నామన్నారు. త్వరలో నియోజకవర్గ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించి దీనిపై నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు చిల్లకూరు సుధీర్‌రెడ్డి, వేగూరు శ్రీనివాసులు, రామాచార్యులు, గోపి, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులను విస్మరిస్తున్న ప్రభుత్వం!



● మనుబోలులో సోమిరెడ్డి విమర్శ

అధికారులు, పాలకుల అనాలోచిత నిర్ణయాల వలన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. ఇటీవల ఆయన మనుబోలు మండలంలో పర్యటించారు. రైతుల సమస్యలపై మాట్లాడుతూ ఈ ప్రాంత రైతాంగం సాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పంటలసాగు చేసుకొనేందుకు నీటి సరఫరా లేక అవస్థలు పడుతుంటే మంత్రి, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కండలేరు జలాశయంలో 19 టిఎంసిల వరకు నీరుందన్నారు. మనుబోలు మండలంలోని రైతాంగం పంటలు సాగు చేసుకొనేందుకు 1.5 టిఎంసిల నీరు విడుదల చేస్తే సరిపోతుందన్నారు. అధికారులు అవగాహనారాహిత్యం కారణంగా మండల పరిధిలోని రైతులకు సాగునీరు అందడం లేదన్నారు. వీరికి నీటిని విడుదల చేయకుండానే చెన్నైకు నీరు విడుదల చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ముందు జిల్లా రైతాంగానికి సాగునీటిని సరఫరా చేసి ఆతర్వాతే చెన్నైకు నీరు విడుదల చేయాల్సి వుండగా అధికారులు ఈ విధానాన్ని అవలంభించకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఐఏబి సమావేశంలోనూ మనుబోలుకు నీటి విడుదలకు తీర్మానం చేసినప్పటికి అది అమలు కాకపోవడం దారుణమన్నారు. జిల్లాలోని సాగుభూములను బీడు భూములుగా మార్చేలా అధికారుల నిర్ణయాలు వున్నాయని ఆగ్రహించారు. దీనిపై టిడిపి ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

● రాపూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ

ఛైర్మన్‌గా మళ్లీ చెన్ను బాలకృష్ణారెడ్డి!

ఆత్మీయులు, అభిమానుల మధ్య ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేసిన చెన్ను బాలకృష్ణారెడ్డిని అభినందిస్తున్న మంత్రి ఆనం.

రాపూరు వ్యవసాయ కమిటీని మరింత అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని కమిటీ ఛైర్మన్ చెన్ను బాలకృష్ణారెడ్డి హామీ ఇచ్చారు. రెండోసారి ఛైర్మన్‌గా ఎంపికైన ఆయన 9వ తేది ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సహకారంతో రెండోసారి ఛైర్మన్‌గా అవకాశం లభించిందన్నారు. గతంలో మార్కెట్ కమిటీ సంవత్సర ఆదాయం 39 లక్షలు ఉండగా తొలిసారి ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆదాయాన్ని 97. 14లక్షలకు పెంచినట్లు తెలిపారు. పొదలకూరు యార్డు, రాపూరు కార్యాలయాలను 1.47కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశామన్నారు. ఆర్థిక మంత్రి సహకారంతో మరిన్ని నిధులు తీసుకొచ్చి ముందు ముందు మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వన్యప్రాణి సంరక్షణ కమిటీ సభ్యులు మెట్టుకూరు ధనుంజయరెడ్డి మాట్లాడుతూ రైతులు ధాన్యం నిల్వ చేసుకొనేందుకు కోల్డ్‌స్టోరేజ్ నిర్మాణం జరపాలని ఛైర్మన్‌ను కోరారు. అనంతరం ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన బాలకృష్ణారెడ్డిని పలువురు ఘనంగా సన్మానించారు. మార్కెట్‌కమిటి పరిధిలోని ఐదు మండలాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు ఈ కార్యక్రమానికి తరలిరావడంతో ఈ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది.

భళా... గూడూరు సబ్ కలెక్టర్ - కావలి ఆర్డీఓ!

గ్యాస్ సరఫరాలో అక్రమాలు జరుగుతుండడం, వినియోగదారులకు సక్రమంగా సిలిండర్ల పంపిణీ జరగకపోతుండడం, బ్లాక్‌లో సిలిండర్ల విక్రయాలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. వీటిని అరికట్టేందుకు డివిజన్‌స్థాయి అధికారులు రంగంలోకి దిగడంతో ఏజన్సీల నిర్వాహకులు హడలిపోతున్నారు. గూడూరు సబ్ కలెక్టర్ నివాస్ స్వయంగా ఈ అక్రమాలను అరికట్టేందుకు నడుంబిగించారు. గూడూరు డివిజన్‌లోని వివిధ గ్యాస్ ఏజన్సీలను తనిఖీ చేయడం, వ్యాపారులు అక్రమంగా గృహ అవసరాలకు పంపిణీ చేసే సిలిండర్లను వినియోగిస్తుండడాన్ని గుర్తించి వాటిని స్వాధీనం చేసుకొన్నారు. ఇదే తీరులో కావలి ఆర్డీఓ సుబ్రహ్మణ్యేశ్వర రెడ్డి పట్టణ పరిధిలో ఆకస్మిక తనిఖీలు జరిపి అక్రమార్కుల గుండెల్లో దడ పుట్టించాడు. ప్రభుత్వ వాహనంలో వెళ్తే సమాచారం ముందే తెలిసిపోతుందని గ్రహించి బైక్ తీసుకొని స్వయంగా నడుపుకొంటూ గ్యాస్ ఏజెన్సీల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. అక్కడ నుంచి పట్టణ పరిధిలోగల పలు అంగళ్లు, టిఫిన్ సెంటర్లను తనిఖీచేసి అక్రమంగా వినియోగిస్తున్న హెచ్‌పి, ఇండియన్ గ్యాస్ ఏజన్సీలకు సంబంధించిన దాదాపు 16 సిలిండర్లను పట్టుకొన్నారు. ఈ తనిఖీలపై ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. గతంలో ఎవరూ చేయని విధంగా ఆర్‌డిఓ తనిఖీలు జరపడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వెట్టి చాకిరీచేస్తూ ప్రాణాలు కోల్పోయాడు!

● చిల్లకూరు డాబాలో గిరిజన బాలుడిని హింసించి చంపిన యజమాని

తండ్రి చేసిన అప్పుకు చిన్న పిల్లవాడిని పనిలో పెట్టుకోవడమేకాక అతడిని హింసించి, శరీరంపై కాల్చి దారుణంగా హతమార్చిన ఘటన చిల్లకూరులో జరిగింది. స్థానికంగా డాబా నిర్వహిస్తున్న మురళీరెడ్డి అనే వ్యక్తి గిరిజనుడైన వెంకటేశ్వర్లనే బాలుడితో డాబాలో పనులు చేయించుకొంటున్నాడు. వారి తల్లిదండ్రులు సైతం చేసిన అప్పు తీర్చలేక పనికి పంపించేవారు. అయితే మానవ రూపంలో వున్న మృగంలా మారి మురళీరెడ్డి ఆ బాలుడిని నిర్భందించి చిత్రహింసలు పెట్టడంతో చిన్నారి బాలుడు మరణించాడు. ఈ ఘటన మండలంలో సంచలనం కల్గించింది. సమాచారాన్ని అందుకొన్న కలెక్టర్ హుటాహుటిన అక్కడకు చేరుకొని బాధిత కుటుంబంతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఒక గిరిజన బాలికపై మురళీరెడ్డి వేధింపులు, అతడిని చూసి వెంకటేశ్వర్లు ఎలా బెదిరిపోయేవాడో వివరంగా చెప్పడంతో కలెక్టర్ చలించిపోయాడు. ఇంత జరుగుతున్నా, గిరిజనులు అప్పు చేయాల్సిన పరిస్థితి ఎదురై, అందుకోసం బాలుడిని బాల కార్మికుడిగా మార్చాల్సి వచ్చినా మీరంతా ఏం చేస్తున్నారని సంబంధిత అధికారులపై ఆగ్రహించారు. పలు సంఘాలు గిరిజన బాలుడిని దారుణంగా హత్య చేయడాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టాయి. పరారీలో వున్న నిందితుడు మురళీ రెడ్డిని పోలీసులు పట్టుకొన్నారు.





నెల్లూరు కస్తూరిబా కళాక్షేత్రంలో జరిగిన వికలాంగుల దినోత్సవంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్‌రెడ్డి. వేదికపై సిటీ ఎమ్మెల్యే శ్రీధరకృష్ణారెడ్డి, డిఆర్వో రామిరెడ్డి, జెసి లక్ష్మీకాంతం వున్నారు.

ఫిషింగ్ హార్బర్ కోసం పోరాడాలి!

మత్స్యకారులకు బీద సూచన

ఫిషింగ్ హార్బర్ కోసం జిల్లాలోని మత్స్యకారులు ఉద్యమించాలని తెలుగుదేశంపార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర పిలుపునిచ్చారు. ఉద్యమ సెగకు మంత్రులు, అధికారులు మీవద్దకు వచ్చేలా ఉద్యమాన్ని నిర్వహించాలని మత్స్యకారులకు సూచించారు. తెలుగుదేశంపార్టీ జిల్లా కార్యాలయంలో ఇటీవల మత్స్యకారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రవిచంద్ర మత్స్యకారులకు దిశానిర్దేశం చేశారు. కృష్ణపట్నంపోర్టు ఏర్పాటుతో ఆ ప్రాంత మత్స్యకారులు ఉపాధి కోల్పోయారన్నారు. తీర ప్రాంత గ్రామాల్లో రోడ్లులేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపాధిహామీ పథకం క్రింద కావలి శాసనసభ్యుడు బీద మస్తాన్‌రావు రోడ్ల కోసం ప్రతిపాదనలు చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. మత్స్యకారుల బాగోగులు కోసం నేషనల్ ఫిష్ రీష్ డెవలెప్‌మెంట్ ఏం చేస్తుందో? వాటి నిధులు ఏమవుతున్నాయో అర్థం కావడం లేదన్నారు. చిప్పలేరు వద్ద ఫిషింగ్ హార్బర్ కోసం అధికారులు సర్వే పూర్తి చేసినా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. దీని కోసం మత్స్యకారులు ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. తెలుగుదేశంపార్టీ అధికారంలోకిరాగానే మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేరుస్తామని హామీ ఇచ్చారు.

బాధ్యతాయుతంగా పని చేయండి!

వెంకటగిరి రెవిన్యూ సిబ్బందికి కలెక్టర్ ఉద్బోధ

గ్రామాల్లో కౌలు రైతులను గుర్తించి వారందరికి గుర్తింపు కార్డులు అందజేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ అధికారులను ఆదేశించారు. ఇటీవల వెంకటగిరి నియోజకవర్గానికి సంబంధించి సమీక్షా సమావేశం నిర్వహించారు. అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే వివిధ పథకాలు ప్రజలకు చేరేలా చూడాలన్నారు. ముఖ్యంగా వైద్యం, ప్రజారోగ్యం పట్ల దృష్టి సారించాలన్నారు. ఎప్పటికప్పుడు ప్రజల సమస్యల పరిష్కారం కోసం పని చేయాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే నిధులను పూర్తిస్థాయిలో ఖర్చుపెట్టాలన్నారు. ఇందులో అవకతవకలు జరిగితే ఉపేక్షించేది లేదన్నారు. ఆరవవిడత భూపంపిణీలో అర్హులను గ్రామసభల ద్వారా గుర్తించి జాబితాను పక్కాగా తయారు చేయాలన్నారు. మేత పోరంబోకు భూములను తొమ్మిదేళ్లుగా సాగు చేసిన అనుభవం వుంటే వారందరు పట్టాకు అర్హులౌతారన్నారు. కౌలు రైతులకు బ్యాంకులు రుణాలు అందించేలా తహశీల్దార్లు తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశానికి హాజరైన వెంకటగిరి శాసనసభ్యుడు కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ వెంకటగిరి వైద్యశాల పరిస్థితి దారుణంగా వుందని, వైద్యులు అందుబాటులో వుండకపోవడంతో ప్రజలకు వైద్య సేవలు అందడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకొని వచ్చారు. మందుల కొరత వుందన్నారు. భూపంపిణీకి సంబంధించి రూపొందిస్తున్న జాబితాలు తప్పుల తడికగా వుంటున్నాయని అర్హులకు అన్యాయం జరుగుతున్నాదని ఆరోపించారు. దీనిని విచారించి అర్హులకు న్యాయం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ లక్ష్మీకాంతం, వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాసిలామణి, డ్వామా పిడి గౌతమి, డిఆర్‌డిఏ పిడి వెంకటసుబ్బయ్య, గూడూరు సబ్ కలెక్టర్ నివాస్, ఎస్సీ కార్పొరేషన్ ఇడి సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



బీమాతో రైతులకు భరోసా!

వ్యవసాయాధికారుల సూచన

పంటల బీమాను రైతులందరూ వినియోగించుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్న, ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటనష్టం జరిగినా బీమా వర్తిస్తుందన్నారు. నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లా రైతాంగానికి ఈ పథకం వల్ల ఎంతో మేలు కల్గుతుందన్నారు. ఒక్కో ఎకరాకు 717 రూపాయలను సంబంధిత బ్యాంకు పేరున డిడి తీయాలన్నారు. బీమా పథకం వల్ల రైతులు పంటలు పండించుకోలేకపోయినా, వేసిన పైర్లు దెబ్బతిన్నారైతులకు ఒక్కో ఎకరానికి 25వేల రూపాయలు పరిహారం లభిస్తుందన్నారు. కౌలు రైతులు దీనికి అర్హులేనని అధికారులు చెప్తున్నారు. రైతుల నష్టాన్ని గుర్తించి పంటను బట్టి బీమా వర్తిస్తుందన్నారు. సాగునీటి అందని ప్రాంతాల రైతులు, మెట్ట ప్రాంతాల రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలన్నారు. ఈ పంటలకు సంబంధించిన విత్తనాలపై సబ్సిడీ అందుతుందన్నారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణా కేంద్రంగా కావలి!

● ప్రతి నిత్యం కోట్లాది రూపాయల అక్రమ వ్యాపారం

రేషన్ బియ్యం అక్రమ రవాణాకు కావలి కేంద్రంగా మారింది. గత కొంతకాలంగా జరుగుతున్న ఘటనలు దీనిని ధృవపరుస్తున్నాయి. పేదల కోసం ప్రభుత్వం చౌక దుకాణాల ద్వారా అందజేసే బియ్యాన్ని ప్రక్కదారి పట్టించి వాటికి పాలిష్ పట్టి అమ్మకాలు సాగించేవారు ఒక ముఠాగా ఏర్పడి గుట్టుచప్పుడు కాకుండా ఈ తతంగం నడిపిస్తుండడంతో పేదల బియ్యం ప్రక్కదారి పడుతున్నాయి. పలువురు రైస్‌మిల్లుల యజమానులు, రేషన్ షాపు డీలర్లు, దళారులు, రెవెన్యూ, పోలీస్ అధికారులు ఈ అక్రమ రవాణాలో పాలుపంచుకొంటున్నట్లు సమాచారం. పొరుగు జిల్లాలైన ప్రకాశం, గుంటూరు జిల్లాల నుంచి టన్నుల కొద్ది రేషన్ బియ్యం కావలికి వస్తున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ గల కొన్ని రైస్ మిల్లులలో ఈ బియ్యానికి పాలిష్ పెట్టి బయటి ప్రాంతాలకు తరలించి కోట్లు గడిస్తున్నారు. ప్రతిరోజూ బియ్యం అక్రమ రవాణా జరుగుతూనే వుంటుంది. కొందరు అవినీతి మరిగిన రెవెన్యూ, పౌరసరఫరాలశాఖ, పోలీస్ సిబ్బంది వీరికి అండదండలు అందిస్తున్నారట. మామూళ్ల మత్తులో వుంటున్న అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడరట. బేరసారాల్లో బేదాభిప్రాయాలు వచ్చినప్పుడో, డబ్బు పంపకాల్లో ఏకాభిప్రాయం కుదరనప్పుడో ఎవరో సమాచారం ఇచ్చారని చెప్పి దాడి చేయడం, బియ్యాన్ని పట్టుకొన్నట్లు చూపి ఫోటోలకు ఫోజులివ్వడం నామమాత్రపు కేసులు నమోదు చేయడం చేస్తుంటారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని కఠినంగా వ్యవహరించక పోతే పేదల బియ్యాన్ని బొక్కేసేవారి సంఖ్య అధికమవుతోంది.

తూతూమంత్రపు సమావేశాలు!

ఇందిరక్రాంతి పథం ద్వారా నిర్వహిస్తున్న సంఘమిత్ర వార్షికోత్సవాలు తూతూ మంత్రంగా ముగుస్తున్నాయి. ఆర్థిక లావాదేవీలు, జమా ఖర్చుల వివరాలు, పనితీరు, ప్రణాళికలు లాంటివి ఏవీ లేకుండానే, సభ్యుల అభిప్రాయాలు పరిగణలోనికి తీసుకోకుండానే ఈ సమావేశాలను జరుపుతుండడంతో వచ్చారు, వెళ్లారు అన్న చందంగా వుంటున్నాయి. సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలోని తోటపల్లిగూడూరు, ముత్తుకూరు, పొదలకూరు,

సంఘమిత్ర సమావేశాలింతే...

మనుబోలు మండలాల్లో జరిగిన ఈ వార్షికోత్సవాలను పరిశీలిస్తే ఈ విషయం తేటతెల్లం అవుతుంది. అధ్యక్షుల తొలిపలుకులు, కార్యదర్శుల మలి పలుకులతో ఇవి ముగిసిపోతున్నాయి. వార్షిక నివేదికలు ప్రస్తావించకుండానే ఈ నివేదిక ఆమోదమైతే మహిళా సభ్యులు చేతులెత్తండని చెప్పగానే వీర విధేయులుగా సభ్యులందరూ చెతులెత్తుతున్నారు. ఐకెపి ఉన్నతాధికారులు ఎవరూ ఈ సమావేశాల ముఖం కూడా చూడలేదు. సభ్యులు ధైర్యంగా తమ బాధలు చెప్పుకోలేని పరిస్థితి ఎదురౌతోంది.

నేను బీద బంధువుని!

● అందరినీ బెదిరిస్తున్న బోగోలు ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ

మంచినీటి సరఫరా పేరుతో అక్రమాలకు పాల్పడుతున్న ఎఇ వ్యవహారంపై బోగోలు మండలంలో గగ్గోలు రేగుతోంది. మంచినీటి ఎద్దడి ఎదుర్కొంటున్న ప్రాంతాల్లో బోరు వేసేందుకు అధికారులు ఇచ్చిన అనుమతులను అడ్డం పట్టుకొని అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పనిచేసిన ప్రతి చోట చేతివాటం ప్రదర్శిస్తూ మంచినీటి కోసం ప్రజలు పడే ఇబ్బందులను తన జేబులు నిండేలా చేయడంలో ఘనాపాటి అనే పేరుంది. కొండ బిట్రగుంట దేవస్థానంలో మంచినీటి కోసం భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై పలువురు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని పోవడంతో మంచినీటి వసతి కోసం లక్షా 20వేల రూపాయలు కేటాయించారు. అధికారుల నిర్ణయంతో భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ఈ బాధ్యతను ఎఇపై పెట్టడంతో మరోమారు చేతివాటం ప్రదర్శించాడట. బోరును సక్రమంగా వేయకుండా పైపైన తక్కువ లోతుకు వేసి, పాత మీటర్‌ను అమర్చి చేతులు దులుపుకొన్నాడట. దీంతో ప్రజలు ఈ విషయంపై ఎంపిడిఓ కనక దుర్గాభవానీకి ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె స్పెషల్ ఆఫీసర్ గురుప్రసాద్, విఆర్ఓతో విచారణ జరిపించగా ఎఇ అవకతవకలు బట్టబయలయ్యాయి. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని ఎంపిడిఓ తెలిపారు. గతంలోను తీరప్రాంత గ్రామాల్లో మంచినీటి సరఫరాలో ఇలాగే అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు వున్నాయి. దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు తన బంధువని చెప్పి దబాయిస్తుంటాడట. ఇలాంటి అధికారిపై ఉన్నతాధికారులతోపాటు ఎమ్మెల్యే తగిన దృష్టి సారించాల్సి వుంది.



నెల్లూరు వేదాయపాళెంలోని ఎంవిఎస్ కళ్యాణ మండపంలో వైకాపా నేతృత్వంలో జరిగిన కంటి వైద్య శిబిరంలో ఆపరేషన్లు చేయించుకున్న వారికి మందుల కిట్ అందజేస్తున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి.



రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 56వ వర్ధంతిని పురస్కరించుకొని నెల్లూరు విఆర్ కాలేజి సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ పార్టీ ఎస్‌సి సెల్ జిల్లా చైర్మన్ టి.బాలసుధాకర్.

● సంక్షేమ రంగాన్ని

విస్మరిస్తున్న ప్రభుత్వం!

దళిత సంఘర్షణ సమితి అధ్యక్షుడు మల్లి ఆరోపణ

సంక్షేమ హాస్టళ్లలో వుంటున్న విద్యార్థుల సంక్షేమాన్ని అధికారులు విస్మరిస్తున్నారని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి విమర్శించారు. బోగోలులో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన హాస్టల్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడారు. చాలీచాలని ఇరుకు గదుల్లో, అరకొర సౌకర్యాల నడుమ హాస్టల్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జిల్లాలోని ఏ హాస్టల్‌ను పరిశీలించినా ఈ విషయం స్పష్టమవుతుందన్నారు. హామీలు గుప్పించే పాలకులకు, అధికారులకు విద్యార్థుల సమస్యలు కన్పించకపోవడం దారుణమన్నారు. సబ్బులు సక్రమంగా అందడం లేదని, చలికాలంలో దుప్పట్లు లేక విద్యార్థులు చలికి ఒణికిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిస్థితి మరింత దారుణంగా వుంటే ముఖ్యమంత్రి, మంత్రులు సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని చెప్పడం విద్యార్థులను మోసగించడమేనని విమర్శించారు. రాష్ట్రప్రభుత్వ వైఖరి వల్ల సంక్షేమం సంక్షోభంలో పడిందన్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు హాస్టల్ విద్యార్థులు ఎదర్కొంటున్న సమస్యలపై స్పందించి కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

కుల సంఘాల దడబడలు!

ఎన్నికల కాలమిది

ఎన్నికలకు ఇంకా గడువు ఉన్నప్పటికీ పలు పార్టీలు, కుల సంఘాలు ఎన్నికల జపం చేస్తున్నాయి. వివిధ పార్టీల నేతలు పాదయాత్రల పేరుతోనో, వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూనో ప్రజలకు దగ్గరయ్యేందుకు ప్రయత్నిస్తున్నాయి. మరోవైపు కులసంఘాల హడావుడి అధికమవుతోంది. చైతన్య సదస్సులంటూ, గర్జనలు, శంఖారావాలంటూ కులసంఘాలు దడబడలు చేస్తున్నాయి. ముఖ్యంగా బిసిల సంక్షేమం, రిజర్వేషన్ అంటూ బిసి నాయకులమని చెప్పుకొనే వారి కదలికలు అధికం అయ్యాయి. ఇంతకాలం తమ స్వార్థం చూసుకొంటూ బిసిల గురించి పట్టించుకోని నేతలు కొందరు ఎన్నికలు దగ్గర పడుతుండడంతో బిసిలపై ఎక్కడలేని ప్రేమ కురిపిస్తున్నారనే విమర్శలు ఆయా కులాల నుంచే వ్యక్తం అవుతున్నాయి. వివిధ కులాల ఓటర్లను ఆకర్షించేందుకు, ఆయా సంఘాల్లో తమ ఆధిక్యతను చాటుకొనేందుకు వివిధ కార్యక్రమాలు రూపొందించి వేదికలెక్కి ఉపన్యాసాలు దంచేవారు ఎక్కువవుతున్నారు. నిన్నమొన్నటి వరకు బిసిల హక్కులు, సంక్షేమం పట్టిని ఈ నేతలకు ఒక్కసారిగా ఈ మాటలు విన్పిస్తుండడం పట్ల పలువురు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మొత్తం మీద అటు పార్టీలు, ఇటు కుల సంఘాల కార్యక్రమాలతో రంజుగా మారింది వాతావరణం.

వెంకటగిరి రైతుల వెతలు!

● నేటికీ అందని సాగునీరు

వెంకటగిరి ప్రాంత రైతాంగం సాగునీటి సమస్య ఎదుర్కొంటోంది. వర్షాభావ పరిస్థితులు రైతాంగాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. డిసెంబర్ నెల వచ్చినా వర్షాలు లేక చెరువుల్లో నీరు లేక ఎలా సాగుచేయాలో దిక్కుతోచని పరిస్థితిలో పడిపోతున్నారు. ముఖ్యంగా కొండక్రింది గ్రామాల్లోని రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా వుంది. ఇటీవల సంభవించిన నీలం తుఫాన్ కారణంగానైనా సాగునీటి సమస్య కొంత మేరైనా తీరుతుందని, చెరువుల్లో నీరు చేరుతుందని ఆశ పడ్డ రైతులకు నిరాశే ఎదురయ్యింది. బోర్లు క్రింద నీటి వసతి లేకపోవడం, తెలుగుగంగ నీరు ఈ ప్రాంతానికి అందదు. దీంతో నార్లు పోయలేని పరిస్థితి. కూలీలకు పనులు లేక పస్తులుండాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. మినుము సాగు చేసే రైతులు నీటి సమస్య ఎదుర్కొంటున్నారు. సాగునీటి సమస్య ఈ ప్రాంత రైతాంగాన్ని పట్టి పీడిస్తుండడంతో వరిసాగు చేయకుండా ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పొద్దుతిరుగుడు, కంది, మొక్కజొన్న, ముడిశనగ పంటలు సాగు చేయడం ఉత్తమమని సూచిస్తున్నారు. ఆ దిశగా రైతులు పంటలు సాగు చేసేలా వ్యవసాయాధికారులు తగిన సలహాలు అందజేయాల్సిన అవసరం ఎంతైనా వుంది.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోండి!

గిరిజనుల కోసం ప్రభుత్వం అందజేసే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వెంకటగిరి మండల అభివృద్ధి అధికారి శివప్రసాద్ సూచించారు. ఇటీవల మండల పరిషత్ కార్యాలయంలో అభివృద్ధి పథకాల అమలుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీలకు కార్పొరేషన్ ద్వారా అందుతున్న రుణాలపై అవగాహన కల్పించాలన్నారు. చాలామందికి వీటి గురించి తెలియకపోవడం వల్ల ప్రభుత్వం అందించే రుణాలను వినియోగించుకోలేక పోతున్నారన్నారు. మరుగుదొడ్ల నిర్మాణాలకు ఎస్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరయ్యాయన్నారు. పంచాయితీల్లో ఒక్క మరుగుదొడ్డి నిర్మించుకొనేందుకు 10వేల రూపాయలు లభిస్తాయన్నారు. మండల పరిధిలోని అమ్మపాళెం, యాతలూరు, పారవోలు, సిద్ధవరం, సోమసానిగుంట పంచాయితీల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామన్నారు. నిధులు మంజూరుకాగానే నిర్మాణాలు చేపడుతామన్నారు. ఉపాధిహామీ పనుల గుర్తింపు 14 పంచాయితీల్లో పూర్తయిందని, కూలీలకు వందరోజుల పని కల్పించే దిశగా చర్యలు తీసుకొంటున్నామన్నారు.

● వెంకటగిరి గిరిజనులకు ఎమ్పీడిఓ సలహా

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి!

● సిఐటియూ జిల్లా కార్యదర్శి రెహనా డిమాండ్

బోగోలు మండలం కొండబిట్రగుంట వద్ద వుండే ఆటోస్టాండు కార్మికులు సిఐటియూ ఆధ్వర్యంలో కొత్తగా సంఘాన్ని ఏర్పాటు చేసుకొన్నారు. దాదాపు 60 మందికి పైగా కార్మికులు ఈ సంఘంలో చేరి నూతన కమిటీని ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సిఐటియూ జిల్లా కార్యదర్శి రెహనాబేగం, గౌరవాధ్యక్షులు ఎంఏ బేగ్‌లు హాజరై ప్రసంగించారు. ఆటో కార్మికులకు స్థలాలు ఇవ్వాలని, ఆటో నిలుపుకొనేందుకు స్థలం కేటాయించాలని కోరారు. ఆటో కార్మికులకు ఎల్లవేళలా అండగా నిలుస్తామని, వారి సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామన్నారు. అనంతరం నాగులవరం, బోగోలు ఆటోస్టాండులకు నూతన కమిటీలను ఎన్నుకొన్నారు. స్థానిక రైల్వేగేటు వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనరసయ్య, కావలి మండల కార్యదర్శి కొండప నాయుడు, రైతు సంఘం నాయకుడు తుమ్మల వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ
వివాహ సంబంధాలకు
: సంప్రదించండి :
Cell: 92476 85582
email : svsmarriagelinks@live.com

జమీన్‌రైతు
పాగతోట, నెల్లూరు - 524 001.
ప్రకటనలకు
98489 66163
98489 66165
చందాలకు
98489 66190



సర్వోత్తమం మార్గశిరం!

కార్తీక అమావాస్య వెళ్లిన వెంటనే వచ్చే మాసం మార్గశిర మాసం. చంద్రమానం ప్రకారం పూర్ణిమ నాడు మృగశిర నక్షత్రంతో వుండే మాసం కాబట్టి దీనికి మార్గశిర మాసం అనే పేరొచ్చింది. ఇది సంవత్సరంలో తొమ్మిదవ మాసం, హేమంత రుతువులో తొలిమాసం. చలి కలిగి వుండడం ఈ మాసం ప్రత్యేకత. అన్ని మాసాల్లోకల్లా మార్గశిర మాసం సర్వోత్తమమైనదిగా చెప్తారు. రుతువుల్లో వసంత రుతువును, ఛందస్సులో గాయత్రిని, మాసాల్లో మార్గశిరాన్ని అని శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీతలో వివరించాడు. లక్ష్మీనారాయణులిద్దరికి ప్రీతికరమైన మాసం ఇది. కృష్ణుడు విష్ణువంశ సంభూతుడు. సౌరమానం ప్రకారం ఈ నెలలోనే ధనుర్మాసం ఆరంభమవుతుంది.

మార్గశిర మాసం ఆధ్యాత్మిక భావాలకు ప్రతీక. కార్తీక మాసంలో పుణ్యనదీ స్నానాలతో తరించిన భక్తుల హృదయాలు మార్గశిర మాసంలో మరింత భగవచ్చింతలో తన్మయమవుతాయి. మనస్సులు ఈ మాసంలో నిర్మలంగా వుంటాయి. సకల చరాచర సృష్టికి చైతన్యాన్ని ప్రసాదించే సూర్యుడు మార్గశిరంలో వృశ్చికరాశిలో నుంచి ధనురాశిలోకి ప్రవేశిస్తాడు. దీనినే నెల పెట్టడం అంటారు. ఆనాటి నుంచి మేష సంక్రమణం వరకు అనగా సంక్రాంతి వరకు ముప్పైరోజుల్ని ధనుర్మాసంగా పరిగణిస్తారు. మార్గశిర మాసానికున్న మరో విశిష్టత నెలలో అన్ని రోజులూ పవిత్రమైనవి కావడం. మార్గశిర మాసం ప్రారంభం రోజున గంగాస్నానం చేయాలని శాస్త్రాలు చెబుతున్నాయి. ఆనాడు చేసే గంగాస్నానం కోటి సూర్యగ్రహణ స్నానాలు చేసినంత ఫలితాన్నిస్తుందని చెప్తారు. మార్గశిర శుద్ధ తదియనాడు ఉమామహేశ్వర వ్రతం, అనంత తృతీయ లాంటి ఫలత్యాగ వ్రతాలు చేయాలని చతుర్వర్గ చింతామణిలో వుంది.

మార్గశిర శుద్ధ చవితినాడు వరద చతుర్థీ, నక్త చతుర్థి వ్రతాలు చేస్తారు. వినాయక పూజ ప్రధానంగా ఈ వ్రతాలు జరుపుతారు. శుద్ధ పంచమినాడు నాగపంచమి వ్రతం చేస్తారు. ఆరోజున నాగపూజ చేసినట్లయితే ఎంతో మంచిదని స్కాంద పురాణం, స్మృతి కౌస్తుభాల్లో వివరించబడింది. ఈ వ్రతాన్ని ఆచరించే వారు ఏకభుక్త నియమాన్ని పాటించాలి. మార్గశిర శుద్ధ షష్టి విశిష్టమైనది. దీనినే సుబ్బరాయ షష్టి అని, సుబ్రహ్మణ్య షష్టి అనే పేర్లతో పిలుస్తారు. ఈ రోజున స్కందషష్టి వ్రతం చేస్తారు. తారకాసురుని సంహారం కోసం జన్మించిన కుమారస్వామి యోగ సాధన చేసి సుబ్రహ్మణ్యతత్వాన్ని తెలుసుకొన్నాడు. శుద్ధ సప్తమి నాడు సూర్యారాధన చేస్తారు. దీనినే మిత్ర సప్తమి అంటారు. పుత్రీయ సప్తమి, ద్వాదశి సప్తమి లాంటి వ్రతాలు ఆనాడు చేపడుతారు. శుక్లపక్ష అష్టమిని కాలభైరవాష్టమిగా జరుపుకొంటారు. కాశీ నగరానికి కాలభైరవుడు క్షేత్రపాలకుడు. ఆయన జన్మదినమైన అష్టమినాడు పూజచేస్తే కాశీక్షేత్ర దర్శన పుణ్యం కల్గుతుందంటారు. నవమి నాడు దేవీపూజా చేయాలని పురుషార్థ చింతామణి చెబుతోంది. దశమినాడు పదార్థవ్రతం, ధర్మ వ్రతం చేస్తారు. ఏకాదశిని మోక్ష ఏకాదశి, సౌఖ్యఏకాదశి అంటారు. ద్వాదశి నాడు మత్స్య ద్వాదశి వ్రతాన్ని, త్రయోదశినాడు అనంగ త్రయోదశి వ్రతాలు ఆచరిస్తారు. చతుర్దశినాడు చాంద్రాయణ వ్రతం చేస్తారు. పూర్ణిమ చంద్రపూజకు మహోత్తరమైనది. ఇన్ని రకాల వ్రతాలు మార్గశిర మాసంలో వుండడం వల్లనే ఈ మాసానికి అంతటి విశిష్టత లభించింది.

ప్రజావిజ్ఞప్తులు

ప్రతివారమూ ప్రజావిజ్ఞప్తుల దినం!



ప్రజావిజ్ఞప్తులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్.

ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావిజ్ఞప్తుల దినానికి వేల సంఖ్యలో వినతులు అందుతున్నాయి. పరిష్కారాలు మాత్రం పదుల సంఖ్యలో వుండడంతో ఈ కార్యక్రమ లక్ష్యం దెబ్బ తినిపోతోంది.

జిల్లా కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమానికి వేల సంఖ్యలో వినతులు అందుతున్నాయి. ప్రజల నుంచి స్వీకరించిన వినతి పత్రాలను పరిష్కరించడంలో అధికార యంత్రాంగం పూర్తిగా వైఫల్యం చెందుతోంది. జిల్లా కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం ఈ కార్యక్రమం నిర్వహిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను తెలుసుకొని, పరిష్కరించాలన్న సంకల్పంతో అనేక సంవత్సరాల క్రితం శ్రీకారం చుట్టారు. అప్పటి కలెక్టర్లు. జిల్లా కలెక్టర్ మారినప్పుడల్లా వివిధ పద్ధతులను పాటిస్తుండడం వలన ఈ కార్యక్రమం ఆశించిన ఫలితాలను సాధించ లేకపోతోంది.

తొలుత జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించి వాటి పరిష్కరించాలని సంబంధితశాఖ అధికారులు, మండల తహశీల్దార్లకు పంపేవారు. ఆ తర్వాత జిల్లా కలెక్టర్‌గా వచ్చిన రాజశేఖర్ అన్ని శాఖలకు చెందిన జిల్లాస్థాయి అధికారులు తప్పనిసరిగా ప్రతి సోమవారం కలెక్టరేట్‌కు రావాలని ఆదేశాలిచ్చారు. అన్ని శాఖల అధికారులు హాజరుకావడంతో వెంటనే వారితో చర్చించి వినతి పత్రాలను అందించేవారు. ఈయన తర్వాత కలెక్టర్లగా వచ్చిన రవిచంద్ర, రాంగోపాల్, ప్రస్తుత కలెక్టర్ శ్రీధర్‌లు కొన్ని శాఖలకు చెందిన అధికారులు హాజరైతే చాలని ఆదేశించారు. దీంతో ఇతర శాఖలకు చెందిన అధికారులు ప్రజావిజ్ఞప్తుల కార్యక్రమం నుంచి మినహాయింపు పొందారు.

రేషన్‌కార్డులు, ఇంటి నివేశన స్థలం, ప్రభుత్వ భూముల పంపిణీ, పట్టాదారు పాసుబుక్‌ల జారీ, వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పింఛన్ల మంజూరు, త్రాగునీటి సరఫరా తదితర సమస్యలపై అధికంగా వినతి పత్రాలు అందుతున్నాయి. వీటిని సంబంధితశాఖ అధికారులకు పంపుతున్నా సరైన విధంగా స్పందించి పరిష్కరించేందుకు కృషి చేయకపోతున్నారు. తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగి విసుగు చెంది మళ్లీ జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించి తమ గోడును వెళ్ల బోసుకుంటున్నారు. జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు పరిపాలనపై పట్టు లేకపోవడం కారణంగా ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ప్రజలను ఇక్కట్లకు గురి చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. పనులను సైతం వదులుకొని సోమవారం కలెక్టరేట్‌కు వస్తున్నా, ఇక్కడ పట్టించుకొనే వారు లేరంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజల నుంచి వస్తున్న వినతిపత్రాలపై నెలకోసారి సమీక్ష జరిపితే ఎన్ని పరిష్కరించారన్న సమాచారం తెలుస్తుంది. జిల్లా కలెక్టర్ వివిధ పనుల ఒత్తిడితో క్రిందిస్థాయి అధికారులపై ఆధారపడుతున్నారు. దీంతో పరిపాలనా గాడి తప్పుతుంది. ప్రస్తుతం జిల్లాలో ఏ కార్యక్రమం జరుగుతుంది? ఏ ప్రభుత్వ పథకాలు అమలవుతున్నాయి? అన్న విషయాలు ప్రజలకు వివరించే దిక్కు లేకుండా పోయారు. ప్రజా విజ్ఞప్తుల దినంకు ప్రతి సోమవారం వచ్చే వారిని కదిలిస్తే చాలు అధికారులు వ్యవహరిస్తున్న తీరుపట్ల ఆసహనం వ్యక్తం చేస్తున్నారు. మండల తహశీల్దార్లు కేవలం అధికారపార్టీ, రాజకీయ నేతల కన్నుసన్నల్లోనే పనిచేస్తూ సామాన్య ప్రజల సమస్యలను గాలికొదిలేస్తున్నారని శాపనార్థాలు పెడుతున్నారు.

ఈ కార్యక్రమం ఉద్దేశం మంచిదే అయినప్పటికి సరైన విధానాన్ని పాటించకపోవడంతో అపహాస్యాల పాలవుతోంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి ఈ కార్యక్రమ లక్ష్యం నీరు కారకుండా ప్రజల సమస్యలను పరిష్కరిస్తే బాగుంటుంది.

నీతి నిజాయితీగా పనిచేయండి!

నీతి నిజాయితీగా పనిచేసి హోంగార్డులు మంచి పేరు తెచ్చుకోవాలని ఎస్పీ బివిరమణకుమార్ సూచించారు. హోంగార్డు శిక్షణ పూర్తిచేసుకొన్న 121 మంది హోమ్‌గార్డులకు 7వ తేది పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో పాసింగ్

కొత్త హోంగార్డులకు ఎస్పీ సలహా.

అవుట్ పెరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరి గౌరవ వందనం స్వీకరించిన ఎస్పీ మాట్లాడుతూ హోంగార్డులు పోలీస్ శాఖలో భాగమేనన్నారు. సివిల్, ఏఆర్ పోలీసుల్లాగే హోంగార్డుల విధులుంటాయి. అన్ని విభాగాల్లో పనిచేయాల్సి ఉంటుంది. చోరీల నియంత్రణ, నేరాల నియంత్రణలో ప్రతిభ నిరూపించుకోవాలన్నారు. రాత్రి పగలు గస్తీలను చురుగ్గా చేయాలన్నారు. విధుల నిర్వహణలో అనేక ఒడిదుడుకులు, ప్రలోభాలు ఉంటాయని ఇటువంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. హోంగార్డుల సేవలను ప్రభుత్వం సైతం గుర్తించిందని వారికి ఇచ్చే రోజువారీ వేతనాన్ని 200 రూపాయల నుంచి 300లకు పెంచిందన్నారు. పోలీసులతో పాటే వివిధ సౌకర్యాలు కల్పించిన విషయాన్ని ఎస్పీ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని హోంగార్డులు నిజాయితీగా పని చేయమని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ఎస్పీ నాగేశ్వరరావు, లా అండ్ ఆర్డర్ ఎఎస్పీ ఎల్‌టి చంద్రశేఖర్, టౌన్ డిఎస్పీ వెంకటనాధ్‌రెడ్డి, రూరల్ డిఎస్పీ బాల వెంక టేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఓ కార్యాలయంలో ఎల్ఎల్ఆర్ మేళా!

నగరంలో ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయంలో రెండు రోజులపాటు ఎల్ఎల్ఆర్ మేళా నిర్వహించారు. 8, 9 తేదీలలో సెలవు దినాలైనప్పటికీ ఎల్ఎల్ఆర్ జారీ చేయాలన్న ఉద్దేశంతో ప్రత్యేక కార్యక్రమాన్ని రవాణా శాఖాధికారులు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం గురించి అధికారులు ముందుగానే ప్రకటించడంతో అధిక సంఖ్యలో లైసెన్స్ కోసం అభ్యర్థులు తరలి వచ్చారు. కంప్యూటర్ నమోదు చేయబడిన 20 ప్రశ్నల్లో పదింటికి సమాధానాల్చిన వారికి ఎల్ఎల్ఆర్ జారీ చేశారు. కంప్యూటర్‌లో నమోదైన ట్రాఫిక్ సిగ్నల్స్ గురించి బాగా చదువుకున్న వారు సైతం సమాధానాల్విలేక పోయారు. 7వ తరగతి చదివి మధ్యలో

సరికొత్త ప్రయోగం

మానేసిన వారు అర్హత సాధించలేక పోయారు. తొలి రోజు 500 మంది హాజరైతే వారిలో 105 మంది అర్హత సాధించారు. రెండవ రోజు 600 మంది హాజరైతే వారిలో 180 మంది ఎల్ఎల్ఆర్‌కు అర్హత సాధించారు. రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్వీఎస్ ప్రసాద్‌రావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించగా ఆర్టీఓ, పలువురు బ్రేక్ ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు. నెలకోసారి ఇటువంటి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పలువురు అభ్యర్థులు అభిప్రాయం వ్యక్తం చేశారు.





నెల్లూరులోని మందాకిని గ్రూప్ ఆఫ్ బార్ అండ్ రెస్టారెంట్స్ అధినేత మావిళ్లపల్లి శ్రీనివాసులు నాయుడు కుమార్తె సౌమ్య, కార్తీక్‌ల వివాహం డిసెంబర్ 7తేది సిపిఆర్ కళ్యాణ మండపంలో జరిగింది.



బిఎంఆర్ హేచరీస్ జిఎం దొడ్ల వేణుగోపాలరెడ్డి తనయ సాయి స్నేహప్రియ, విక్రమ్ కృష్ణారెడ్డిల వివాహం డిసెంబర్ 8తేది నెల్లూరు కస్తూరిదేవి గార్డెన్స్‌లో జరిగింది.



ఆత్మకూరు పంటవీధి వాస్తవ్యులు దేవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుమారుడు వివేకానందరెడ్డి - మమతల వివాహం నవంబర్ 30తేది నెల్లూరులోని ఎంసిఎస్ కళ్యాణ మండపంలో జరిగింది.



ఉదయగిరిలో జరిగిన జనవిజ్ఞాన వేదిక రజతోత్సవ వేడుకల్లో మాట్లాడుతున్న నెల్లూరు ఎమ్పీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి. వేదికపై ఫరూఖ్ అలీ, ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి వున్నారు.



మేషం
అశ్వని, భరణి, కృత్తిక 1 పా

తలపెట్టిన పనులలో అవాంతరాలు ఎక్కువ. బంధుమిత్రులతో సంఘీభావాలుండవు. ఆదాయానికి తగ్గట్టు ఖర్చులుంటాయి. చేసే పనులలో ఏకాగ్రత లోపించి, మీ ఆలోచనలు పక్కదారి పడతాయి. వృత్తి, వ్యాపారాలు పుంజుకుంటాయి. వ్యవసాయదారులకు రుణ సమస్యలు పరిష్కారం కాగలవు. స్థానమార్పులు గాని లేదా పర స్థల నివాసం గానీ ఏర్పడగలదు.



వృషభం
కృత్తిక 2,3,4 పా. రోహిణి, మృగశిర 1,2 పా

గతవారం వలె తరచూ పనులు వాయిదాపడతాయి. చేసే శుభ కార్యాలలో సమస్యలుంటాయి. అవివాహితులు తమ వివాహ విష యంలో జాగ్రత్తలు అవసరం. కుటుంబ సమస్యల పరిష్కారానికి తొందరపాటు పనికిరాదు. విద్యార్థులు నూతన ప్రయోగాలు చేయ వద్దు. ముఖ్యంగా మీ అంతర్గత విషయాలను బహిర్గతం చేయ కండి. ఇంటా బయట ఖర్చులు పెరిగే సూచనలున్నాయి.



మిథునం
మృగశిర 3,4 పా. ఆర్ద్ర,పునర్వసు,1,2,3 పా

పనులలో ఆటంకాలున్నా బుద్ధిబలంతో ముందుకు వెళ్తారు. శత్రు బాధలు అధికం. ఉద్యోగులు పై అధికారులకు సంజాయిషీలు, క్షమాపణలు చెప్పవద్దు. అనవసర ప్రయాణాలు తగ్గించండి. అవ సరానికి డబ్బు చేతికి అందుతుంది. నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు అందుతాయి. గత కొంతకాలంగా వున్న ఆస్తి వివాదాలు కొలిక్కి వస్తాయి. వృత్తి, వ్యాపారాలలో ఆర్థికాదాయాలుంటాయి.



కర్కాటకం
పునర్వసు 4 పా. పుష్యమి, ఆశ్లేష

పనులు నెమ్మదిగా సాగుతాయి. తరచూ ప్రయాణాలుంటాయి. ముఖ్య సమాచారం వింటారు. ఉద్యోగులు ఒక విషయమై అధికా రులను సంప్రదిస్తారు. స్త్రీ విషయంలో రహస్య చర్చలకు తావివ్వ వద్దు. ముఖ్య విషయాలలో హామీలు వుండవద్దు. అధిక ధన వ్యయం వుంటుంది. స్థానచలనాలు, అకాల భోజనం వుంటుంది. వ్యవసాయదారులు చేసే స్థిర ఆలోచనలు కలసి వస్తాయి.



సింహం
మఖ, పుబ్బ ఉత్తర 1 పా

పనులలో సంయమనం పాటించుటచే స్థిరత్వం ఏర్పడగలదు. వృత్తి, వ్యాపార, ఉద్యోగాలలోని వారి వ్యక్తిగత విలువలను ఎదుటివారు గుర్తిస్తారు. కోపతాపాలకు తావివ్వవద్దు. నూతన ఆలోచనలకు అననుకూలం. ధన వ్యయం, మాతృబంధువుల ఆదరణ, లేదా మాతృ వర్గ సంబంధ సమస్యలు తగ్గుతాయి. చిన్ననాటి మిత్రులను కలుసు కొంటారు. వృత్తి, వ్యాపారాలలో సామాన్య లాభాలుంటాయి.



కన్య
ఉత్తర 2,3,4పా., హస్త, చిత్తా 1, 2 పా

ఈ రాశివారు ఉత్సాహంగా పనులు చేపడతారు. వృత్తి, ఉద్యోగ, వ్యాపార మరియు అన్ని రంగాల వారి ఆర్థికస్థితి మెరుగౌతుంది. సన్నిహితులతో ఆనందంగా గడుపుతారు. మీరు చేసే ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. అయితే అనవసర అలవాట్లు పెరుగు తాయి. విద్యార్థులు సాహస ప్రయత్నాలు చేయవద్దు. వ్యవసాయ దారులకు శారీరక, మానసిక సమస్యలుంటాయి.

వారఫలాలు

తేది 15-12-2012 నుండి 21-12-2012 వరకు వృషభంలో గురు, కేతువులు; తులలో శని; వృశ్చికంలో బుధ, శుక్ర, రాహువులు, రవి 16తేది వరకు తదుపరి ధనుస్సులో; 18తేది వరకు కుజుడు ధనుస్సులో తదుపరి మకరంలో; ధను, మకర, కుంభ, మీనాలలో చంద్రుడు సంచరిస్తారు.

పంచాంగం

16తేది ధనుర్మాసారంభం.
18తేది సుబ్రహ్మణ్య షష్ఠి.

శుభ ముహూర్తాలు

15, 16,17తేదిలలో వివాహ, గృహ ప్రవేశ, గర్భాదాన, గృహారంభ, సీమంత, అన్నప్రాసనాది మరియు సామాన్య వ్యవహారాలకు ముహూర్తాలున్నాయి.

డిసెంబర్ తిథులు

మార్గశిర శుద్ధ

15	శని	విదియ	ఉ	07.01 గం.ల.వ
		తదుపరి తదియ	రా	03.57 గం.ల.వ
16	ఆది	చవితి	రా	01.27 గం.ల.వ
17	సోమ	పంచమి	రా	11.40 గం.ల.వ
18	మంగళ	షష్ఠి	రా	10.40 గం.ల.వ
19	బుధ	సప్తమి	రా	10.32 గం.ల.వ
20	గురు	అష్టమి	రా	10.15 గం.ల.వ
21	శుక్ర	నవమి	రా	12.13 గం.ల.వ

అక్కరాజు బాలసుబ్రహ్మణ్యం
7/34, దొడ్ల సుబ్బారెడ్డి నగర్, నవలాకులతోట, నెల్లూరు – 2. సెల్: 95819 76599.



తుల
చిత్తా 3,4 పా, స్వాతి, విశాఖ 1,2,3 పా

చేసే పనులలో ఒంటరి పోరాటం తగదు. అవసరానికి డబ్బు చేతికి అందుతుంది. ఇంట్లో శుభకార్య చర్చలు మధ్యలో ఆగుతాయి. అనుభవం లేని వారి మాటలు లేదా నిర్ణయాలు పాటించవద్దు. రాజీ ప్రయత్నాలు పూర్తిగా నెరవేరవు. పట్టుదలకు వెళ్లి ఆర్థిక నష్టం తెచ్చుకోకండి. ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి, వ్యాపార రంగాల లావాదేవీలు ఉత్సాహంగా సాగుతాయి.



వృశ్చికం
విశాఖ 4 పా, అనూరాధ, జేష్ఠ

ఈవారం కూడా గతవారం వలె వుండి, విజయాలను ఆలస్యంగా చూస్తారు. సంతాన విషయంలో సంజాయిషీ ఇచ్చుకోవాలి. ఉద్యో గులకు అనుకూలం. చేతి వృత్తి, వ్యవసాయదారులకు అభివృద్ధి సామాన్యం. నూతన గృహ నిర్మాణాది విషయాలు కట్టుదిట్టమౌ తాయి. ప్రయాణాలు అనుకూలించవు. కళా, క్రీడా రంగాల వారికి ఆశాజనక స్థితి. రాజకీయులు ఎత్తుకు పైఎత్తులు వేస్తారు.



ధనుస్సు
మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా

ఈ రాశివారు నూతన మార్పులకై అన్వేషిస్తారు. అనుమానాలు తగ్గించుకొంటారు. అవివాహితులకు వివాహ యోగం. చేసే పను లలో కొన్నింటిపై తీవ్ర కృషి అవసరం. చిన్న చిన్న విషయాలలో కూడా తమ అంచనాలు తలక్రిందులౌతాయి. వృత్తి, వ్యాపారాలలో వ్యయం కంటే ఆదాయం ఎక్కువగా వుంటుంది. సంతాన విష యాలు సమయస్ఫూర్తితో పరిష్కారమౌతాయి.



మకరం
ఉత్తరాషాఢ 2, 3,4 పా. శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా

ఇంటాబయట అనుకూలతలు సాధిస్తారు. ఇంట్లో శుభకార్య యత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగుల ప్రతిభతో పై అధికారుల ప్రశం సలు అందుకొంటారు. దేవాలయ సందర్శన, స్వయం వృత్తుల వారికి అనుకోని ప్రోత్సాహం. శరీరారోగ్యం అతిశయించును. వ్యవ సాయదారులకు రుణ దాతల ఒత్తిడి అధికం. ఇతరులపై అనవసర విమర్శలు మానండి. వైదిక క్రతువులపై ఆసక్తి పెంచుకొంటారు.



కుంభం
ధనిష్ఠ 3,4 పా. శతభిషం, పూర్వ భాద్ర 1,2,3 పా

కుటుంబంలో వున్న ప్రధాన సమస్యలకు తెరదీస్తారు. వృత్తి, వ్యాపా రాలలో ఆర్థికంగా ముందంజ. కొన్ని ముఖ్య నిర్ణయాలపై హడా వుడి నిర్ణయాలు వద్దు. భాగస్వామ్య ఒప్పందాలు సజావుగా సాగు తాయి. పితార్జిత అంశాలపై దృష్టి వుంచండి. కోర్టు వ్యవహారాలు అనుకూలిస్తాయి. వ్యవసాయదారులు చేపట్టిన పనులలో చిన్న చిన్న ఇబ్బందులున్నా పనులన్నీ పూర్తవుతాయి.



మీనం
పూర్వాభాద్ర 4 పా, ఉత్తరాభాద్ర, రేవతి

గతం కన్నా మెరుగ్గా వుంటుంది. వృత్తి, వ్యాపార, ఉద్యోగులకు స్థానచలనం వుంటుంది. ఆర్థిక ఇబ్బందులు తొలగుతాయి. అకాల శత్రుత్వం ఏర్పడగలదు. ముఖ్యమైన కార్యక్రమాలు నెమ్మదిగా పూర్తి చేస్తారు. ఆకస్మిక ప్రయాణాలచే శరీరారోగ్య సమస్యలు బాధి స్తాయి. వివాహాది శుభకార్యాల చర్చలు సామరస్యమైనా ఫలితం శూన్యం. ధన వ్యయాన్ని అదుపు చేయలేరు.

ఏకా'విశంతి' మహాదోషాల్లో 'శుభ ముహూర్తాలు' నిషిద్ధం!

డాక్టర్ ఎన్.శేషయ్యశాస్త్రి చెన్నై

** ఇరవై ఒక్క దోషాలలో శుభ ముహూర్తా లుండవని ముహూర్త మార్తాండం చెబుతోంది. వివరణ ఇవ్వండి?*

గరుతుల్యులు, కురువృద్ధులకు శతాధిక వంద నాలు. పంచాంగ శుద్ధి, సూర్య సంక్రాంతి, దుష్ట స్థానాల్లో చంద్రస్థితి, అష్టమిలగ్నం, గ్రహణోత్పాతం, క్రూరనిషిద్ధ నక్షత్రం, మహాపాతం, వైధృతి, భృగు షట్కం వంటి 'ఏక విశంతి' దోషాల్లో శుభ ముహూ ర్తాలుండవని శాస్త్రాలు చెబుతున్నాయి. ఇవి మీకు తెలియనివా?

డాక్టర్ పరాశరన్ చెన్నై

** జ్యోతిష శాస్త్ర సృజనకారులలో 'కుము ద్వతి' పేరు వినవస్తున్నది. ఈమె ఎవరు?*

ఈమె విశ్వామిత్ర మహర్షి భార్య. ఈమెకు శిష్యప్రశిష్యులున్నట్లు ఆధారాలున్నాయి.

షేక్ కరీముల్లా ముంబై

** ఒక సంవత్సరం చరిత్రను సంక్షిప్తంగా చెప్పండి?*

ఒక సంవత్సరానికి 12 నెలలు, 3 కాల ములు, 6 ఋతువులు, 24 పక్షములు, 52 వార ములు, 365 రోజులు.

డి.ఏసుపాదం నెల్లూరు

** చెట్టును కొట్టివేశాక, ఇప్పుడు బాధపడు తున్నాను.*

వృక్ష వేధో దోషం వల్లే మీకు పెరాలసిస్ వచ్చింది. మీరు నూట ఎనిమిది మొక్కల్ని నాటి సంరక్షించండి. దోషం పోతుంది.

పి.పరబ్రహ్మశాస్త్రి చెన్నై

** 'తులసి చెట్టు'ను గురించి చదివి ఆశ్చర్య పోయాను.*

వశిష్ఠ సంహితలో దుష్ట పిశాచ వేధో నివా రణిగా చెప్పబడింది. శాస్త్రజ్ఞులు దీన్నే "రెమిడీ ఫర్ ది సైకోలాజికల్ స్ట్రెస్"గా అభివర్ణిస్తున్నారు.

డాక్టర్ కుముద్వతి చెన్నై

** 'పర్జన్య గర్జన ఘోష మృత్యువై' అంటారు. ఒక చోట 'లగద మహర్షి'.*

జ్యోతిష శాస్త్ర సృజనకారులలో ప్రథమ వర్గా నికి చెందిన వారు 'లగద' మహర్షి. జ్యోతిష, విధి ప్రభావాలను గురించి ఆయన రాస్తూ అన్న మాట లివి. దుష్టుడు ఉరుముల సమయంలో అర్జునా, పార్థా అను శ్లోక పఠనం చేసినప్పటికీ అతడు దుష్టుడు కాబట్టి పిడుగు అతని ఇంటిపైనే పడిం దట!

టి.రాధ నెల్లూరు

** అమ్మాయి వివాహం పెద్ద సమస్య అయి పోయింది?*

మీ సుదీర్ఘమైన ఉత్తరం చదివాను. ఆగ్నేయ, వాయువ్య దోషాలున్నప్పుడు పరిస్థితి ఇంతే. సం బంధిత యంత్ర ప్రతిష్ట చేసుకోండి. వ్యతిరేక, అను కూల నక్షత్రాలలో ఏది బలీయమో గుర్తించి రత్నధారణ చేస్తే సమస్య పరిష్కారమవుతుంది.

వాస్తు సందేహాలు సమాధానాలు

ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి
4వ వీధి, గాయత్రినగర్, ఎ.కె. నగర్ పోస్టు, నెల్లూరు-4.
ఫోన్: 2322345, సెల్: 9490125878.

షేక్ పీరాఖాసిం గూడూరు

** నాలుగు స్థలాలు కొన్నాను. బాగా కలసి వచ్చింది. భూమి రిజిస్ట్రేషన్ వెంటనే అన్నీ పోగొట్టు కున్నాను.*

ఆలయ, స్మశాన, దర్గా సమీప స్థలాల కొను గోళ్లలో చాలా జాగ్రత్త అవసరం. దుష్ట స్థలాల్ని కొన్న వెంటనే ఉన్న ఆస్తులు మొత్తం హరించుకు పోతాయి.

కె.టి.ఆర్ నెల్లూరు

** ఇల్లు మారినా రాత మారడం లేదు. ఏమిటీ పరీక్ష?*

వాస్తు దోషాలు సవరించుకోకుండా, జ్యోతిష శాస్త్ర ఆటంకాల్ని అధిగమించకుండా ఎంత దూరం పారిపోయినా అవి మిమ్మల్ని వదలవు. ధైర్యంగా నిలబడి శాస్త్రజ్ఞుల అండ తీసుకోండి.

ఎన్.భాస్కరన్ నెల్లూరు

** వాస్తు దోషాల విషయంలో రక్షణ ఎలా లభిస్తుంది?*

యజమాని నక్షత్రం, వీధి గణనలతో ఇరవై ఎనిమిది యంత్రాలలో వచ్చే యంత్రాన్ని దేవుడి గది పైభాగంలో ప్రతిష్టించుకొంటే ఆకస్మిక సమస్యల్ని కూడా గృహస్తు అధిగమిస్తాడు.

ఇ.వి.సుప్రజారెడ్డి చెన్నై

** భర్త చనిపోయాడు. వివాహమై కుమార్తె వెళ్లిపోయింది. కుమారుడు ఉండీ పట్టించుకోడు.*

నైరుతి సెప్టిక్ ట్యాంక్ తీసివేసి ఉత్తరం వైపు నిర్మించండి. గీతాపఠనం ఉత్తమ మార్గం మీకు. ఒం టరిగా వచ్చి ఒంటరిగా వెళ్లిపోయే మనిషి మాయలో పడ్డమే బాధలకు కారణమని గుర్తిస్తే మీకీ వేదనే ఉండదు.

ముత్తుకూరు పంచాయితీలో

నిధుల దుర్వినియోగంపై విచారణ ఏది?

ముత్తుకూరు గ్రామ పంచాయితీకి ఇన్‌ఛార్జ్ కార్యదర్శిగా వ్యవహరించిన వ్యక్తి దరిదాపులు 20 లక్షల రూపాయలు స్వాహా చేశాడన్న ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశించిన జిల్లా పంచాయితీ అధికారులు ఆ తర్వాత ఈ విషయాన్ని మర్చిపోవడం విమర్శలకు తావిచ్చింది.

ముత్తుకూరు గ్రామ పంచాయితీలో జరిగిన నిధుల దుర్వినియోగంపై విచారణ ముందుకు సాగడం లేదు. నెలల తరబడి కాలయాపన చేస్తుండడంతో ఇందుకు బాధ్యుడైన కార్యదర్శి విచారణ నుంచి తప్పించుకునే అవకాశం ఉంది. సేకరించిన సమాచారం ప్రకారం ముత్తుకూరు గ్రామ పంచాయితీకి ఇన్‌ఛార్జ్ కార్యదర్శిగా వ్యవహరించిన వ్యక్తి దాదాపు 20 లక్షల రూపాయలు స్వాహా చేశాడంటూ భారతీయ జనతా పార్టీకి చెందిన స్థానిక నాయకుడు జిల్లా పంచాయితీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. నిధుల స్వాహాకు సంబంధించిన ఫిర్యాదు అందడంతో విచారణకు డివిజన్ పంచాయితీ అధికారి సత్యనారాయణను నియమించారు. ఇతనిని విచారణాధికారిగా నియమించి నెలలు గడుస్తున్నా విచారణ జరగక పోవడంపై అనేక అనుమానాలు వ్యక్త మవుతున్నాయి. ప్రస్తుతం గ్రామ పంచాయితీ కార్యదర్శిగా వేరొకరిని నియమించారు. కేవలం రికార్డులు అందజేయలేదన్న సాకుతో విచారణ వాయిదా వేస్తున్నట్లు సమాచారం.

బిల్ కలెక్టర్‌గా ఉన్న వ్యక్తికి జూనియర్ అసిస్టెంటుగా పదోన్నతి కల్పించడం, ఆ తర్వాత ఇన్‌ఛార్జ్ కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించడంపై అనేక సందేహాలు వ్యక్తమౌతున్నాయి. డిపార్టుమెంటు అకౌంటెంట్ పరీక్ష ఉత్తీర్ణత కాబడిన వారినే ఇన్‌ఛార్జ్ కార్యదర్శిగా నియమించాలన్న నిబంధన ఉంది. జిల్లా పంచాయితీ కార్యాలయంలో కొందరు సిబ్బంది చేతివాటం ప్రదర్శించి అకౌంటెంటు పరీక్ష ఉత్తీర్ణత కాకపోయినా కూడా జూనియర్ అసిస్టెంటుగా ఉన్న వ్యక్తికి ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులిచ్చారు. 2010 – 11, 2011 – 12 ఆర్థిక సంవత్సరానికి ఇన్‌ఛార్జ్‌గా ఉన్న సమయంలో పంచాయితీకి సంబంధించిన నిధుల్ని స్వాహా చేశాడన్నది ప్రధాన ఆరోపణ. అక్రమలే అవుట్లకు అనుమతి ఇవ్వడం, తూతూ మంత్రంగా పంచాయితీ సమావేశాలు నిర్వహించి నిధులు స్వాహా చేయడంపై విచారణ జరగాల్సి వుంది.

ముత్తుకూరు గ్రామ పంచాయితీకి రెగ్యులర్ కార్యదర్శి నియామకం జరిగిన తర్వాత అప్పటి వరకు ఇన్‌ఛార్జ్‌గా ఉన్న జిలానీ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లాడు. విచారణాధికారి జమా ఖర్చు లెక్కలకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకునేందుకు పంచాయితీ కార్యాలయానికి వెళ్లలేదని స్థానికులు చెబుతున్నారు. ఇన్‌ఛార్జ్ కార్యదర్శి సెలవుపై వెళ్లిన సమయంలో కొత్తగా వచ్చిన కార్యదర్శికి అన్ని రికార్డులు అప్పగించాలి. ఒకవేళ రికార్డులు అప్పగించకుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ మొత్తం వ్యవహారాన్ని జిల్లా కార్యాలయంలో విధులు నిర్వహించే ఓ వ్యక్తి తెరచాటున ఉండి నడుపుతున్నట్లు ప్రచారం జరుగుతుంది. గత వారంలో సెలవుపై వెళ్లిన ఇన్‌ఛార్జ్ కార్యదర్శి ఎవరి అనుమతి లేకుండానే పంచాయితీ కార్యాలయానికి వెళ్లి కొన్ని రికార్డులను తీసుకుంటున్న సమయంలో ఇతనిపై ఫిర్యాదుచేసిన వ్యక్తి ప్రశ్నించడంతో వివాదం రేగింది.

నిధులు స్వాహా ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి కార్యాలయంలోని బీరువాను తెరచి కొన్ని రికార్డులను తీసుకెళ్లేందుకు ప్రయత్నించడం, ఎలాగైనా విచారణ నుంచి బయట పడేందుకేనని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. విచారణాధికారిగా నియమితుడైన డిఎల్‌పిఓ సత్యనారాయణ ఉదాసీనత వైఖరి కారణంగా రికార్డులను తారుమారు చేసే పనికి పూనుకున్నాడన్న విమర్శలు వినిపిస్తున్నాయి. విచారణ ఇన్‌ఛార్జి కార్యదర్శిని బయటపడేసేందుకు రాజకీయ ప్రయత్నాలు జోరందుకున్నాయి. విచారణ జరిపేందుకు జరుగుతున్న ఆలస్యంపై డిఎల్‌పిఓను వివరణ కోరగా రికార్డులు అప్పగించలేదని సమాధానం చెప్పాడు. త్వరలో నోటీసులు జారీచేసి నిధులు స్వాహాకు సంబంధించిన రికార్డులన్నింటినీ స్వాధీనం చేసుకుంటానని చెప్పాడు.

రెండు సంవత్సరాల పాటు ఇన్‌ఛార్జి కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన జూనియర్ అసిస్టెంటు జిలానీ మాట్లాడుతూ తాను ఒక్క పైసా కూడా నిధుల దుర్వినియోగంగానీ, స్వాహాగానీ చేయలేదని చెప్పాడు. అనారోగ్యం కారణంగా తాను సెలవు పెట్టినట్లు, త్వరలో అన్ని రికార్డులను అధికారులకు అప్పగించనున్నట్లు తెలిపాడు. ఈ వ్యవహారంపై విచారణ జరిపించాల్సిన అవసరం ఉంది.

రాలుతున్న పసిమొగ్గలు

బ్రూణహత్యలపై నియంత్రణ ఏది?



స్కానింగ్‌లో ఆడపిల్ల అని నిర్ధారణ అయిన వెంటనే గర్భవతులు అబార్షన్ చేయించుకొంటున్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్ష చేయరాదన్న హెచ్చరిక నోటీసులు గోడలకు వ్రేలాడుతుంటాయి. లోపల మాత్రం వీటి ఉల్లంఘన జరిగిపోతూనే ఉంటుంది.

జిల్లావ్యాప్తంగా బ్రూణ హత్యలు జరుగుతున్నా వీటిని నియంత్రణకు ప్రభుత్వపరంగా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. తల్లి గర్భంలోనే మాతృత్వాన్ని చంపేస్తున్న వారికి కఠిన శిక్షలు పడే విధంగా చట్టాలు ఉన్నప్పటికీ అమలుచేసే విషయంలో అధికారులు ఉదాసీనతగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా ఆడపిల్ల అని నిర్ధారణ జరిగితే వెంటనే అబార్షన్ చేయించుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేయరాదని నోటీసు బోర్డులు దర్శనమిస్తున్నా ఇవి కేవలం గోడలకే పరిమితమై ఉన్నాయి. లింగ నిర్ధారణకు ప్రోత్సహించిన వారిని, పరీక్షలు నిర్వహించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే అధికారం ఉన్నా వివిధ రాజకీయ ఒత్తిళ్ల కారణంగా వెనుకంజ వేస్తున్నట్లు తెలుస్తుంది.

లింగ నిర్ధారణలో ఆడ శిశువని తేలితే అబార్షన్ చేయించుకుంటున్నారు. ఈ విధానం కారణంగా కొన్ని పరిస్థితులలో తల్లి కూడా ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుంది. గర్భం దాల్చిన మహిళ ప్రాణాలకు ముప్పు వాటిల్లే సమయంలోనూ శిశువు అంగ వైకల్యంతో ఉన్నట్లు నిర్ధారణ జరిగితే చట్టబద్దంగా అబార్షన్ చేసే అవకాశం ఉంది. ఈ విషయాన్నే మెడికల్ టెర్మినేట్స్ ఆఫ్ ప్రెగ్నెన్స్(ఎంటిపి) చట్టం చెబుతుంది. సంబంధిత గైనకాలజిస్ట్, అల్ట్రాసౌండ్ వైద్యులు(సోనాలజిస్టు) పర్యవేక్షణలో అబార్షన్ చేయాలి. అత్త, భర్త ఆడ శిశువు అని తెలుసుకుని అబార్షన్ చేయించరాదు.

జిల్లాలో దాదాపు 300 స్కానింగ్ సెంటర్లు ఉండగా, ఒక్క నెల్లూరు నగరంలోనే 100 స్కానింగ్ సెంటర్లు ఏర్పాటై ఉన్నాయి. వీటిలో గుర్తింపు పొందినవి 20 మాత్రమే. ఎండి అర్హత కలిగిన వారు మాత్రమే స్కానింగ్ తీయాల్సి ఉంటుంది. గర్భకోశ వైద్యులు రెఫర్ చేస్తేనే పరీక్షలు నిర్వహించాలన్న నిబంధన కూడా ఉంది. దురదృష్టవశాత్తు ఎటువంటి అర్హతలేని వారే స్కానింగ్ తీస్తున్నారు. వైద్యుల సిఫార్సు ఉన్నా లేకున్నా సొంతంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేసేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం, లంచాలకు కక్కుర్తిపడి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు వీటి గురించి పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. ఇటీవల ఆ శాఖ కార్యాలయంలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు, ఇతర వైద్యులకు శిక్షణా శిబిరం జరిగింది. ఈ శిక్షణా శిబిరంలో కూడా నిబంధనల గురించి మరోసారి గుర్తుచేసిన అధికారులు, అమలుచేసే విషయంలో చిత్తశుద్ధి పాటించడం లేదు.

పిఎన్‌డిటి యాక్టు – 1994 ప్రకారం లింగ నిర్ధారణ పరీక్షలు జరిపినా అబార్షన్ చేసినా, మూడు సంవత్సరాలు జైలు శిక్ష, 50వేల రూపాయల జరిమానా, రెండవ దఫా ఇదే నేరం చేస్తే 5 సంవత్సరాల జైలు శిక్ష, 50వేల రూపాయల జరిమానా, మూడవ దఫా మళ్లీ నేరానికి పాల్పడితే డాక్టర్ డిగ్రీని మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రద్దు చేస్తుంది. జిల్లాలో ఇప్పటివరకు ఈ చట్టాన్ని అనేకమంది ఉల్లంఘిస్తున్నా ఒక్కరిపై కూడా కేసు నమోదు చేసిన దాఖలాలు కనిపించడం లేదు.

చట్టంపై ప్రచారం లేదు

పిఎన్‌డిటి యాక్టు – 1994 అమలు గురించి వైద్యులు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు వైద్య, ఆరోగ్య శాఖలో ఆరోగ్య ప్రచార శాఖ అనే విభాగం (డెమో) ఉంది. ఆరోగ్య శాఖకు సంబంధించిన కార్యక్రమాలపై ప్రచారం నిర్వహించడంతోపాటు రోగాల నియంత్రణకు సూచనలు, చేయడం దాని ప్రధాన ఉద్దేశం. ఈ విభాగానికి అవసరమైన నిధులు విడుదల చేస్తున్నా ప్రచారం మాత్రం చేయడం లేదు. ప్రభుత్వ వాహనం, ప్రొజెక్టర్, ఎలక్ట్రిషియన్, అటెండర్, ఇద్దరు అధికారులు ఈ విభాగంలో విధులు నిర్వహించాలి. అయితే జిల్లా కార్యాలయంలో ఎనిమిది మంది ఉద్యోగులు ఈ విభాగంలో విధుల్లో ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. జిల్లా అధికారి ఆధీనంలో ఉంచుకోవడంతో ఎటువంటి ప్రచారం చేయలేక పోతున్నారన్న విమర్శలున్నాయి. ఈ విభాగం ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించేది. డిఎం అండ్‌హెచ్‌ఓగా మాశిలామణి బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఈ విభాగం కార్యక్రమాల గురించి పట్టించుకోవడం లేదు. సిబ్బంది పనిలేక కార్యాలయంలో గోళ్లు గిల్లుకుంటున్నారు. ఇటీవల బ్రూణ హత్యలు అధికమౌతున్న నేపథ్యంలో ప్రచారం చేయలేకపోవడం అధికారుల అలసత్వానికి నిదర్శనమనవచ్చు.

కొందరు వైద్యులు బ్రూణ హత్యలకు పాల్పడే వారిపై 302 సెక్షన్ కింద కేసులు నమోదు చేయాలన్న అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇతర వ్యక్తులను హత్యచేస్తే ఐపిసి సెక్షన్ 302 కింద ఎలా కేసు నమోదు చేస్తున్నారో అదేవిధంగా గర్భంలో శిశువు హత్య కూడా తీవ్రమైన నేరంగానే పరిగణించాలంటున్నారు. చట్టం కఠినంగా లేకపోతే భవిష్యత్‌లో మరిన్ని బ్రూణ హత్యలు జరిగే ప్రమాదం ఉంది.



దేవరాయ ధమాల్!

✍ అల్లూరు రహీం

ప్రస్తుతం సోషియో ఫాంటసీ చిత్రాల సీజన్ నడుస్తుంది. నానిగాడి సినిమా బ్యానర్‌పై నాని కృష్ణ నిర్మాత, దర్శకునిగా వ్యవహరిస్తూ శ్రీకాంత్‌ను హీరోగా పెట్టి తీసిన సోషియోఫాంటసీ చిత్రం దేవరాయ. శ్రీకృష్ణదేవరాయలు సకల కళావల్లభుడు. అష్టదిగ్గజాలు, భువనవిజయాలు ఆయన్ను ఎంతో లబ్ధప్రతిష్టుడ్ని చేశాయి. ఆయన జీవనయానంలో సునంద అనే నర్తకి ఉందని, ఆమె కోసం శ్రీకృష్ణదేవరాయలు ఆంధ్రదేశంలోని గోదావరి తీరానికి వచ్చి చేసిన నిర్వాకానికి విజయనగర పతనం జరిగిందని దర్శకుడు దేవరాయ చిత్రంలో చూపాడు. అంతవరకు బాగానే ఉంది. కానీ శ్రీకృష్ణ దేవరాయలు అంశంతో పుట్టే దొరబాబును మద్యపాన ప్రియుడిగా, స్త్రీలోలుడిగా, చతుర్ముఖపారాయణ ప్రియునిగా చూపి ఆ నోట బూతులు పలికించిన తీరు బాగోలేదు. వాస్తవానికి చిత్రం ప్రథమార్థమంతా బూతులమయమవడంతో సెన్సార్ కత్తెరకు చాలా డైలాగులు, పాటల్లో చరణాలు మాయమై పోయాయి. ఈ వ్యవహారం వెండితెరపై స్పష్టంగా కనపడిపోతుంది. శ్రీకృష్ణదేవరాయలు ఎపిసోడ్ వచ్చే వరకు ఏదో ఒకటి చూపాలన్న ప్రయత్నంలో దర్శకుడు ప్రథమార్థమంతా సాగతీతకు ప్రయత్నించాడు. దీనిలో భాగమే ఈ సినిమాలో ఏడు పాటలకు స్థానం కల్పించడం. వీటిలో బావలు, చంపేస్తున్నావే, గుచ్చి గుచ్చి చరణాలతో సాగే పాటలు చక్రి సంగీతంలో పరవాలేదనిపిస్తాయి. పాటలను విదేశీ సౌందర్య మాయలో కెమెరామెన్ పూర్ణకాంద్రు బాగానే తీశాడు. శ్రీకృష్ణ దేవరాయలు ఎపిసోడ్ కూడా కెమెరామెన్ వల్ల రక్తి కట్టింది. చిత్రానికి రవిరెడ్డి వ్రాసిన స్క్రీన్‌ప్లేలో సవాలక్ష జంపింగ్స్ ఉన్నాయి. కొత్త మాటల రచయిత వీర బాబు వ్రాసిన మాటల్లో మనసులో విషయం అర్థం చేసుకొనేది అమ్మ... దేవుడే. ఆస్తికంటే గుణం... ప్రేమకంటే జీవితం ముఖ్యం. ఆశ అదుపులో ఉండాలి. మాట పొదుపుగా వాడాలి ఆలోచింపజేస్తాయి. చిత్రంలో పది నిమిషాలలోపు ఉన్న గ్రాఫిక్స్ కూడా పరవాలేదనే చెప్పాలి. అయితే చిత్ర ప్రథమార్థం మరీ బలహీనమయ్యి దేవరాయ చిత్రాన్ని నిస్సత్తువ చేశాయి.

చిత్ర సమీక్ష

చిత్ర కథలోనికి వెళ్తే అమలాపురంలో మోతుబరి రైతు కుటుంబీకుడు దొరబాబు(శ్రీకాంత్). ఆయన స్నేహితులు ఎం.ఎస్.నారాయణ, జీవా, కొండవలస, తిరుపతి ప్రకాష్ బృందంతో కలసి చేసే వెధవ పనులకు అంతూపంతూ ఉండదు. గ్రామంలో పురావస్తు ప్రేమికుడు(రంగనాథ్) మనుమరాలు స్వప్న(విదిశ) పట్నం నుంచి వస్తుంది. ఈమెను ఎలాగైనా తన దారికి తెచ్చుకొని అనుభవించాలనుకొంటాడు దొరబాబు. కానీ స్వప్న దొరబాబుకు లొంగదు. దీంతో ఈమెను పెళ్లి చేసుకోవాలనుకొంటాడు. తాంబూలాలు మార్చుకొంటున్న సమయంలో సిద్ధేంద్రయోగి(సమ్మెట గాంధీ) వస్తాడు. దైవకార్యం చేయతలపెట్టిన దొరబాబుకు పెళ్లి కుదరదని; 500 ఏళ్ల క్రితం అతను శ్రీకృష్ణదేవరాయలుగా పుట్టాడంటాడు. ఇక్కడ నుంచి శ్రీకృష్ణదేవరాయలు ఎపిసోడ్ ప్రారంభమవుతుంది. తన ఆస్థానంలో నర్తించను గోదావరి తీరం నుంచి వచ్చే నర్తకి సునంద(మీనాక్షి దీక్షిత్)ను చూసి మనసు పారేసుకొంటాడు శ్రీకృష్ణదేవరాయలు. ఇంతలో మొగల్ చక్రవర్తి బాబర్ విజయనగర సామ్రాజ్యాన్ని తన రాజ్యంలో కలపమని ఫర్మానా పంపిస్తాడు. ఈ సమయంలోనే శ్రీకృష్ణ దేవరాయలు జాతకంలో వైకుంఠపాళి నడుస్తుందని రాజ్యహద్దులు దాటకూడదంటాడు రాజగురువు. కానీ శ్రీకృష్ణదేవరాయలు గోదావరి తీరంలోని నర్తకి సునంద దగ్గరకు వెళ్లి ఆమె ప్రేమకు గుర్తుగా ఒక మందిరం కడతానని బల్లెం విసురుతాడు. ఆ బల్లెం వశిష్టుడు తన తపోశక్తితో ప్రతిష్టించిన త్రిపుర సుందరి విగ్రహానికి తగులుతుంది. శ్రీకృష్ణదేవరాయలు రాజ్యభ్రష్టుడవుతాడు. 500 ఏళ్ల తర్వాత రాంబాబు శ్రీకృష్ణదేవరాయలు అంశతో పుట్టి త్రిపుర సుందరి విగ్రహ పునఃప్రతిష్ట చేయడంతో చిత్రం ముగుస్తుంది.

రెండు షేడ్‌ల పాత్రలను శ్రీకాంత్ బాగానే పోషించాడు. హీరోయిన్లు మీనాక్షి దీక్షిత్, విదిశ గ్లామర్ బొమ్మలే. మిగతా నటులకు పెద్ద పాత్రలు లేవు. ఏదో తీయాలని ఏదేదో తీసేసిన చిత్రంగా దేవరాయను అభివర్ణించవచ్చు.



చంద్రగిరి రాణిగా ప్రియమణి!

హీరోయిన్ ఓరియెంటెడ్ కథల్లో నటించాలని మన హీరోయిన్లు తహతహలాడుతుంటారు. వేశ్య, విధవ, కుంగిపోయిన సినీతారల కథలతో గతంలో ఎన్నో చిత్రాలు తయారయ్యాయి. ప్రస్తుతం ట్రెండ్ మారింది. కాల్పనిక చారిత్రక పాత్రల్లో నటించాలని హీరోయిన్లు ఉవ్విళ్లూరుతున్నారు. గద్వాల్ రాణి అరుంధతిగా అనుష్క రాణించడమే దీనికి కారణం. ఈ తరహా పాత్రలోనే కనిపించేందుకు ప్రియమణి సన్నాహాలు మొదలు పెట్టింది. ఆమె నాయికగా అంగుళీక అనే సినిమా మొదలవుతుంది. ప్రేమ్ ఆర్య దర్శకుడు. తమిళ, తెలుగు భాషల్లో దీన్ని తెరకెక్కిస్తారు. చిత్తూరు జిల్లాలోని చంద్రగిరి కోట నేపథ్యంలో ఈ కథ సాగుతుంది. ఈ ప్రాంత రాణిగా ప్రియమణి నటిస్తుంది. రాణి పాత్ర మనసుకు బాగా నచ్చడంతో నటించడానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు ప్రియమణి చెప్పింది.

సల్మాన్‌ఖాన్ సినిమా స్టార్టింగ్



సాయపడడంలో గొలుసు పద్ధతి అనుసరిస్తే అందరిలోనూ సేవా దృక్పథం పెరుగుతుందని చెప్పిన సినిమా స్టాలిన్. చిరంజీవి నటించిన చిత్రమిది. ఇందులో దర్శకుడు ఎ.ఆర్. మురగదాస్ చెప్పిన కాన్సెప్ట్ ఇప్పుడు హిందీ సినీ జనాలకు వచ్చింది. ఈ సినిమాను త్వరలో హిందీలో రీమేక్ చేయబోతున్నారు. సల్మాన్‌ఖాన్ కథానాయకుడిగా నటిస్తారు. ఆయన సోదరుడు సోహైల్‌ఖాన్ దర్శకత్వం వహిస్తారు. త్వరలోనే ఈ సినిమా సెట్‌పైకి వెళ్తుందని సమాచారం. ఇందుకు సంబంధించిన కథా చర్చల్లో తెలుగు రచయిత కోన వెంకట్ కూడా పాలుపంచుకొంటున్నారు. ఉత్తరాదికి అనుగుణంగా మార్పుచేర్పులు చేస్తున్నట్లు తెలిసింది. ఈ సినిమాను వచ్చే రంజాన్ సమయానికి విడుదల చేయాలని భావిస్తున్నారు.



షారూఖ్ ప్రేయసి!

రొమాంటిక్ హీరోగా షారూఖ్‌ఖాన్ పేరుగాంచాడు. తెరపై ఎన్నో ప్రేమ పాత్రల్లో కనిపించాడు. అంతకంటే గొప్పదైన ప్రేమకథ తన వాస్తవ జీవితంలో ఉందన్నాడు ఈ బాలీవుడ్ బాద్షా. స్కూల్ పార్టీలో ఓ అమ్మాయిని చూశాను. అప్పటివరకూ ఎప్పుడూ ఏ అమ్మాయితోనూ డ్యాన్స్ చేయలేదు. కానీ ఆ అమ్మాయిని చూడగానే డ్యాన్స్ చేయాలనిపించింది. కానీ అప్పటికే ఆమె నా స్నేహితుడితో డ్యాన్స్ చేస్తుంది. నాతో డ్యాన్స్ చేస్తుందేమో అని అడగమని నా స్నేహితునికి చెప్పాను. ఆమె ఒప్పుకొని డ్యాన్స్ చేసింది. ఆ తర్వాత ఆమె టెలిఫోన్ నెంబరు అడిగి తీసుకొన్నాను. కానీ అలా జరుగుతుందనే ఊహించలేదు. చివరకు ఆమెను పెళ్లి చేసుకొన్నాను. ఆ అమ్మాయే నా జీవిత భాగస్వామి గౌరీ. నా జీవితంలో తొలి చివరి ప్రేయసి గౌరీయే అని చెప్పాడు షారూఖ్ ఖాన్.

బాబులతో వివాదాలు



తక్కువగా సినిమాల్లో నటించినా వివాదాలతో కావాల్సినంత ప్రాచుర్యం పొందిన నటి వీణామాలిక్. పాకిస్తాన్‌కు చెందిన ఈ నటి తెలుగులో నగ్న సత్యం చిత్రంలో నటిస్తుంది. షూటింగ్ గ్యాప్‌లో పిచ్చాపాటీగా మాట్లాడుతూ చిత్రపరిశ్రమలో వివాదాలు భాగమైపోయాయి. ఒక ప్యాకేజ్‌లో భాగంగానే వివాదాలు చుట్టుముడుతుంటాయేమో అని నా అభిప్రాయం. కొత్త చోటుకి వెళ్లినప్పుడు నాగూర్చి ఏదో వివాదం ప్రస్తావనతోనే పలకరిస్తున్నారు. దానికి నేను సమాధానమిస్తుంటాను. మళ్లీ కొత్త వివాదం మొదలవుతుంది. నేను అందరిలాంటి యువతినే. నాపనేదో నేను చూసుకొంటూ అతి సాధారణంగా మసలుకొంటుంటా. అయినప్పటికీ ఏదో ఒక వివాదంలో నన్ను భాగస్వామిని చేస్తున్నారని వాపోయింది.



ఇలియానా తీరని కోరిక!

కోటి రూపాయలు తీసుకొనే కథానాయికల క్లబ్‌లో ఎప్పుడో చేరి నటిగా పేరు తెచ్చుకొన్న ఇలియానా నటించడం తన డ్రీమ్ కాదంటుంది. ఈ విషయమై వివరిస్తూ నాకు నటించడం పెద్దగా రాదు. దేవదాసు చిత్రం తర్వాత నటించనన్నాను. ఆ సినిమా హిట్ అయ్యాక మా అమ్మ నీలో మంచి నటి ఉంది. అందువల్లే ఈ చిత్రం విజయం సాధించిందని ప్రోత్సహించింది. టీవీలో వచ్చే టామ్ అండ్ జెర్రీ, ఫ్లిన్‌స్టోన్, ఎల్లీమెక్ బీల్ కార్యక్రమాలంటే చిన్నప్పుడు ఎంతో ఇష్టంగా చూసేదాన్ని. పుస్తకాలు ఎక్కువగా చదివేదాన్ని. సిడ్నీషెల్టన్ పుస్తకాలంటే నాకెంతో ఇష్టం. నేను క్లానిక్ చిత్రాలంటే చెవికోసుకొంటాను. సీరియస్‌గా ఉండే సినిమాలు చూడను. షూటింగ్ చేసి బోర్ కొట్టినప్పుడు ఓ రొమాంటిక్ సినిమా చూస్తాను. మనసుకు కాస్త విశ్రాంతిగా ఉంటుంది. నేను మంచి గాయని కావాలని ఆశపడ్డాను. కొన్ని కార్యక్రమాలకు కూడా వెళ్లాను. కానీ ఎందుకో నా ఆశ నెరవేరలేదని ఇలియానా బాధపడుతూ చెప్పింది.

● సాంకేతిక పరిజ్ఞానంతో

నేరస్తుల గుర్తింపు!

కొత్త ఐజి రవికుమార్ గుప్తా వెల్లడి



మాట్లాడుతున్న ఐజి రవికుమార్ గుప్తా.

జిల్లాలో నిత్యం చోరీలు, భారీ దోపిడీలకు పాల్పడుతున్న నేరస్తులు పోలీసులకు సవాల్‌గా మారిన సంగతి తెలిసిందే. గత నెల రోజుల నుంచి ప్రతి రోజు నగరంతోపాటు ఇతర ప్రాంతాల్లో ఇళ్లలో చోరీలు జరుగుతూనే ఉన్నాయి. పోలీసులు మాత్రం నేరాలను నియంత్రించలేక పోతున్నారు. ఈ నేపథ్యంలో గుంటూరు రేంజ్ ఐజిగా బాధ్యతలు చేపట్టిన రవికుమార్ గుప్తా ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా పోలీసు అధికారులతో నేర సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్ష అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఐజి నేరాల నియంత్రణకు సంబంధించి ఏదైనా సమాచారం వెల్లడిస్తారని ప్రింటు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పోలీసు క్రీడా మైదానంలోని ఉమేష్‌చంద్ర సమావేశ మందిరానికి వెళ్లారు. అప్పటికే సమీక్ష జరుపుతున్న ఐజికి విలేకరులు వచ్చారన్న సమాచారాన్ని చేరవేయడంతో మధ్యలో ముగించారు. ఆ తర్వాత విలేకరులతో ముచ్చటిస్తూ జిల్లాకు సంబంధించి పోలీసుల పని విధానంపై సందేహాలు చెప్పాలని ఐజి విలేకరులను కోరారు. దీంతో మీడియా ప్రతినిధులు కొద్దిసేపు ఆలోచించి ప్రశ్నలు అందించారు. నేరాలు, చైన్‌స్నాచింగ్‌లు అధికమవుతున్నాయని, వీటిపై ఎటువంటి చర్యలు తీసుకోబోతున్నారన్న ప్రశ్నకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నేరస్తులను గుర్తించేందుకు కృషి చేస్తున్నట్లు ఐజి చెప్పారు. ఇటీవలనే తాను గుంటూరు రేంజ్ ఐజిగా బాధ్యతలు స్వీకరించానని తొలిసారిగా నెల్లూరు జిల్లా పర్యటనకు వచ్చినట్లు ఆయన చెప్పారు. పాత నేరస్తుల జాబితా పోలీసుల వద్ద ఉందని దీని ఆధారంగా వారిపై నిఘా ఉంచుతున్నట్లు తెలిపారు. గుప్త నిధుల కోసం పురాతన దేవాలయాలను లక్ష్యంగా చేసుకుని, అందులోని పంచలోహ విగ్రహాలను చోరీ చేస్తున్నారని వివరించారు. జిల్లాస్థాయిలో సమస్యలు పరిష్కారం కాకుంటే తనకు ఫిర్యాదు చేయమని కోరారు. ఫిర్యాదుచేసినా, ఫోన్‌చేసినా వెంటనే స్పందిస్తానన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ వివరమణకుమార్ చిల్లకూరులో గిరిజన బాలుడి హత్య జరగడం దురదృష్టకరమన్నారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసు శాఖ అన్ని చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.

జనవరిలో ఫ్లెమింగో ఫెస్టివల్!

● 7, 8, 9 తేదీల్లో నిర్వహించాలని నిర్ణయం



సమీక్షా సమావేశంలో కలెక్టర్, డిఆర్వో.

ప్రతి సంవత్సరం సూళ్లూరుపేటలో నిర్వహించే పక్షుల పండుగను 2013 జనవరిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. గతంలో పక్షుల పండుగను నిర్వహించేందుకు పలు దఫాలు రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరపాల్సి ఉండేది. అయితే ఈ దఫా ఎటువంటి చర్చలు లేకుండానే పర్యాటక శాఖకు సంబంధించిన క్యాలెండర్‌లో పక్షుల పండుగను ప్రభుత్వం చేర్చింది. నిర్ణీత తేదీలను ప్రకటించడం జరిగింది. దీంతో జిల్లా అధికార యంత్రాంగం పక్షుల పండుగ ఏర్పాట్లలో నిమగ్నమైంది. జిల్లా కలెక్టర్ ఇటీవల గోల్డెన్ జూబ్లీ హాల్‌లో వివిధ శాఖలకు చెందిన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి కమిటీలను నియమించారు. జనవరి 7, 8, 9 తేదీల్లో మూడు రోజులపాటు పక్షుల పండుగను నిర్వహించాలని నిర్ణయించారు. అన్ని శాఖలకు చెందిన అధికారులను ఇందులో భాగస్వాములను చేస్తూ 15 కమిటీలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ పండుగను చైర్మన్‌గా జిల్లా కలెక్టర్, కో – చైర్మన్‌గా జిల్లా ఎస్పీ, వైస్ చైర్మన్‌గా జాయింట్ కలెక్టర్, కార్యదర్శిగా డిఆర్వో, కన్వీనర్‌గా గృహ నిర్మాణ సంస్థ ప్రత్యేకాధికారి ఉంటారు. రిసెప్షన్ ప్రోటోకాల్ కమిటీ, ఎగ్జిబిషన్ కమిటీ, ఫుడ్ కమిటీ, పబ్లిసిటీ కమిటీ, కల్చరల్ కమిటీ, స్పోర్ట్స్ కమిటీ, బోట్ షికార్ కమిటీ, పక్షులను సందర్శకులకు చూపించేందుకు ఒక కమిటీ, హార్టికల్చర్ కమిటీ, పాఠశాల విద్యార్థులను తరలించే కమిటీ, పారిశుద్ధ్యం, త్రాగునీటి సరఫరా కమిటీ, వైద్య, ఆరోగ్య శాఖ కమిటీ, ట్రాన్స్‌పోర్ట్ కమిటీ, లా అండ్ ఆర్డర్ కమిటీలను నియమించారు. మూడు రోజులపాటు నిర్వహించే ఈ పక్షుల పండుగకు రాష్ట్ర మంత్రులు హాజరుకానున్నట్లు కలెక్టర్ చెప్పారు. గత పక్షుల పండుగకు సినీ, టివి యాంకర్లు రావడం వలన శాంతిభద్రతల సమస్య తలెత్తడంతో వారిని ఈసారి ఆహ్వానించడం లేదు.

విద్యాశాఖ పనితీరు బాగోలేదు!



విద్యామంత్రి శైలజానాథ్ సమీక్షలో జిల్లా అధికారులు.

మండల విద్యాశాఖాధికారులపై జిల్లా కలెక్టర్ శ్రీధర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో నమోదుకాబడిన విద్యార్థులు, హాజరువుతున్న విద్యార్థుల శాతానికి ఏమాత్రం పొంతన కుదరడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. బడిబయట ఉన్న పిల్లలను గుర్తించేందుకు తీసుకుంటున్న చర్యలపై వివరించేందుకు కలెక్టర్ ఎంఇఓలతో విద్యాశాఖ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన ఎంఇఓలకు పాఠశాల నిర్వహణపై ప్రశ్నల వర్షం కురిపించడంతో సరైన సమాధానాలు చెప్పలేక ఉక్కిరిబిక్కిరైనారు. తాను గ్రామాలకెళ్లిన సమయంలో అనేక పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించడం జరిగిందని కలెక్టర్ గుర్తు చేశారు. హాజరు పట్టికలో ఎక్కువ మంది నమోదు కావడం, విద్యార్థులు తక్కువ సంఖ్యలో హాజరు కావడం ఏమిటని ప్రశ్నించారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే ప్రధానోపాధ్యాయులు బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని ఆదేశించారు. ప్రతి ఇంటికి వెళ్లి తల్లితండ్రులతో చర్చించి వారికి అవగాహన కల్పించాలన్నారు.

"చిన్నారి చూపు" ప్రారంభం

పాఠశాలల్లో అంధత్వం కలిగిన బాలబాలికలకు చూపు తెప్పించేందుకు రూపొందించిన "చిన్నారిచూపు" కార్యక్రమాన్ని 7వ తేది రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ కార్యక్రమాన్ని జిల్లాలో అమలు చేసేందుకు విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. మండల కేంద్రాల్లో విద్యార్థులకు కంటి చూపు తెప్పించేందుకు స్క్రీనింగ్ టెస్టులు కూడా నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 14వేల మంది బాల బాలికలను ఇప్పటికే గుర్తించారు. అవసరమైన వారికి జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శస్త్రచికిత్సలు చేయించాలని అధికారులు నిర్ణయించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి మువ్వా రామలింగం, జిల్లా అంధత్వ నివారణ సంస్థ మేనేజర్ డాక్టర్ మంజులమ్మ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి శైలజానాథ్ అసంతృప్తి

గత వారంలో జిల్లా పర్యటనకు వచ్చిన మాధ్యమిక విద్యాశాఖ మంత్రి శైలజానాథ్ కూడా రాజీవ్ విద్యామిషన్ అధికారుల పనితీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో పాఠశాలల భవనాల నిర్మాణాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయించడంలో విఫలం చెందారంటూ మండిపడ్డారు. పినాకినీ అతిథి గృహంలో ఆర్వీఎం అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి నిధులు మంజూరు చేసినప్పటికీ అదనపు గదులను ఎందుకు పూర్తి చేయలేక పోతున్నారని ప్రశ్నించారు.



ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఆర్థిక మంత్రి రామనారాయణరెడ్డి.

అత్యాధునిక అనూష మినరల్ వాటర్!

నెల్లూరు – ముత్తుకూరు రోడ్డులో ఐదవ కిలోమీటరు వద్ద కొత్తగా పెట్టిన అనూష మినరల్ వాటర్ ప్లాంట్‌ను రాష్ట్ర ఆర్థిక మంత్రి ఆనం రామనారాయణరెడ్డి 9వ తేది ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోనే మొట్ట మొదటిసారిగా మన నెల్లూరులో అత్యంత ఆధునిక పరికరాలతో అనూష మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. నాణ్యతా ప్రమాణాలతో అనూష మినరల్ వాటర్ ప్లాంట్ నెల్లూరీయుల ఆదరాభిమానాలు పొందుతుందన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. ప్లాంట్‌లో 20 లీటర్ల క్యాన్ల విభాగాన్ని సిటీ ఎమ్మెల్యే శ్రీధరకృష్ణారెడ్డి, ఒక లీటర్ బాటిళ్ల విభాగాన్ని ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, రూపాయి ప్యాకెట్ విభాగాన్ని కలెక్టర్ బి.శ్రీధర్‌రెడ్డి, టెస్టింగ్ రూమ్, బయోటెక్నాలజీ ల్యాబ్‌ను మాదాసు గంగాధరం ప్రారంభించారు. అనూష మినరల్ ప్లాంట్ అధినేతలు వి.కృష్ణమూర్తి, వి.శైలేంద్రనాథ్ మాట్లాడుతూ మూడు కోట్ల రూపాయలతో ఆంధ్రప్రదేశ్‌లోనే మొట్టమొదటిసారిగా ఆపహ వారి అనూష వాటర్ ప్లాంట్‌ను నెల్లూరులో ప్రారంభించామని అత్యుత్తమ అంతర్జాతీయ ప్రమాణాలతో త్రాగు నీటిని అందిస్తామన్నారు. కార్యక్రమంలో వేమారెడ్డి శ్యామ్‌సుందర్ రెడ్డి, హరిబాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

స్మైల్ దంత వైద్యశాలలో ఆధునిక వైద్యం!

డాక్టర్ కిరణ్ వెల్లడి



అత్యంత తక్కువ ఖర్చుతో జర్మోని యంతో రూపొందించిన దంతాలను అవసరమైన వారికి అమర్చేందుకు నెల్లూరు రమేష్‌రెడ్డి నగర్‌లోని స్మైల్ దంత వైద్యశాల సిద్ధంగా ఉన్నట్లు డాక్టర్ జి.కిరణ్ చెప్పారు. తన వైద్యశాల 14వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని 5వ తేది విలేకరులతో మాట్లాడారు. నగరాలకే పరిమితమైన అత్యంత అధునాతనమైన దంత వైద్యాన్ని స్మైల్ దంత వైద్యశాలలో అందుబాటులోనికి తీసుకొచ్చాం. టెక్నాలజీతో కూడిన పరికరాలతో ఇన్‌ప్లాంటేషన్ పద్ధతిలో దంత చికిత్సలు చేస్తున్నాం. ఎత్తు పళ్లు సరిచేసే పలు ప్రక్రియల్లో విజయం సాధించాం. అయినా ప్రతి ఒక్కరూ దంత సమస్యలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని డాక్టర్ కిరణ్ చెప్పారు. డిఇఓ అనుమతి తీసుకొని జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత వైద్యశిబిరాలను ఏర్పాటుచేసి విద్యార్థులకు దంత సమస్యల పట్ల అవగాహన కల్పిస్తున్నామన్నారు. మధుమేహ వ్యాధిగ్రస్తుల్లో చిగుళ్లకు సంబంధించిన సమస్యలు ఉంటాయని వాటిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే దంత సమస్యలను వీలైనంత మేర తగ్గించుకోవడం సాధ్యమౌతుందన్నారు.

ప్రభుత్వానికి పక్షవాతం!

మొదటి పేజీ కొరవ

ఈ నేపథ్యంలో రాష్ట్రంలో తీవ్రమైన రాజకీయ శూన్యం ఏర్పడి వుంది. పేరుకు ప్రభుత్వం నడుస్తున్నదే తప్ప దాని ఉనికికి అర్థమే లేదు. తెలంగాణపై అఖిల పక్ష సమావేశం విషయంలో ముఖ్యమంత్రి ఉనికిని ఏ మాత్రం పట్టించుకోలేదు హోంమంత్రి సుశీల్‌కుమార్ షిండే. రాష్ట్రంలో సగం మంది మంత్రుల వైఖరి కూడా అదే. వారి దృష్టిలో కిరణ్‌కుమార్ రెడ్డి ముఖ్యమంత్రే కాదు. ఆరోగ్య మంత్రి డిఎల్ రవీంద్రరెడ్డి నేరుగా ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రిని శాపనార్థాలు పెడుతూ ప్రకటనలిస్తున్నాడు. మంత్రిగా వుంటూ మంత్రి మండలిని చులకన చేస్తున్నా ఆయన మీద చర్య తీసుకొనే అధికారం కిరణ్‌కుమార్ రెడ్డికి లేకుండా పోవడం గమనార్హం. మరొకప్రక్క శీతాకాల సమావేశాల నిర్వహణకు వెనుకడుగు వేసి ప్రభుత్వ పరువు తీశాడు ముఖ్యమంత్రి. రాష్ట్ర చరిత్రలో ఇప్పటి వరకు శీతాకాల శాసనసభ సమావేశాలను రద్దు చేసిన సాదృశ్యం లేదు.

ఇక సెక్రటరియేట్ గురించి ఎంత తక్కువగా మాట్లాడుకొంటే అంత మేలు. చాలామంది మంత్రులు సెక్రటరియేట్‌కు వెళ్లడం మానుకొన్నారు. అక్కడకు వెళ్లినా చేయగల్గింది ఏదీ లేదన్న నిరాశే అందుకు కారణం. వారి మాట అధికారులు వినడం లేదు. మంత్రులు చేసే సిఫార్సులను ఐఎఎస్ అధికారులు చెత్త బుట్టలో పారేస్తున్నారు. కనీస గౌరవం ఇవ్వడం లేదు. మంత్రులు పిలిస్తే కలవడానికి కూడా వెళ్లడం లేదు. అన్నీ నిబంధనల ప్రకారం వుండి, తమకు ఏ ఇబ్బందీ లేదనుకొన్న ఫైళ్ల మీద మాత్రమే సంతకాలు పెడుతున్నారు అధికారులు.

ఎస్పీ ఉప ప్రణాళిక, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ పెంపు వంటి అంశాలలో కిరణ్‌కుమార్ రెడ్డి సాహసోపేత నిర్ణయాలు తీసుకొన్నప్పటికీ, ఆయన ప్రభుత్వ ప్రతిష్టను అవి ఎంత మాత్రం పెంచలేక పోతున్నాయి. రాజకీయంగా ఆయన బలహీనుడు కావడం, మంత్రుల సహకారం లభించకపోవడం వల్లనే ఈ దుస్థితి. నిజానికి మరొక ముఖ్యమంత్రి ఈ రెండు నిర్ణయాలు తీసుకొని వుంటే ఈపాటికి పెద్ద సంచలనం అయి వుండేది. రాజకీయంగా ఎంతగానో ఉపయోగపడి వుండేవి. కానీ దురదృష్ట వశాత్తు కిరణ్‌కుమార్‌రెడ్డి ఆ ప్రయోజనాన్ని పొందలేక పోతున్నాడు.

తీహార్ జైలుకు తరలిస్తారా?

మొదటి పేజీ కొరవ

ప్రత్యేక గది, అందులో పరుపు దిండ్లు, భోజనం వండి వడ్డించడానికి వంట మనిషి, టివి, దినపత్రిక సౌకర్యం వంటివన్నీ అధికారికంగానే లభిస్తున్నాయనకు. మరొక ప్రక్క జగన్ పార్టీలో చేరాలనుకున్న వారందరూ నేరుగా జైలుకు వెళ్లి ఆయనతో మాట్లాడి రాగలుగుతున్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన ప్రతి అంశాన్ని, నిర్ణయాన్ని ఆయన ఏమాత్రం ఇబ్బంది లేకుండా జైలు నుంచి నడపగలుగుతున్నాడు. తీహార్ జైలుకు మారిస్తే ఈ సౌకర్యాలలో కొన్ని దూరమై పోతాయి. ఎవరు పడితే వారు ఇష్టం వచ్చిన సమయంలో ఇష్టం వచ్చినంత సేపు మాట్లాడి వెళ్లే అవకాశం లేకుండా పోతుంది. అది తప్ప తీహార్‌కు, చంచలగూడా జైలుకు పెద్దగా తేడా లేకపోయినా ఢిల్లీ జైలు అంటే మానసికంగా ఇబ్బంది అవుతుంది.

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ చొరవ, తీరు చూస్తుంటే జగన్‌ను తీహార్‌కు తరలించడం ఖాయమేమో అన్న భావన కల్గుతున్నది. ఇప్పటి వరకు జగన్‌ను కేవలం సిబిఐకి సంబంధించిన కేసులలో మాత్రమే అరెస్ట్‌చేసి ఉన్నారు. ఆ కేసులు న్యాయస్థానంలో నిలవవని, సరైన సాక్ష్యాలు ఆధారాలు లేవని జగన్ నమ్మకం. రామ్‌జఠ్మలానీ వంటి న్యాయనిపుణులు ఆయనకు ఆ నమ్మకం కల్గించారు. అయితే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ కేసు పెట్టడం అంటూ జరిగితే మనీ ల్యాండరింగ్ చట్టం క్రింద ఉంటుంది. ఈ కేసు నిలబడినా నిలబడక పోయినా బెయిల్ రావడం మాత్రం చాలా కష్టం. సత్యం రామలింగరాజు, జార్ఖండ్ ముఖ్యమంత్రి మధుకోడా విషయంలో జరిగింది అదే. జగన్‌ను కూడా ఆ చట్టాల చట్రంలో ఇరికిస్తే రేపటి ఎన్నికల సమయంలో కూడా ఆయన జైలులోనే గడపాల్సి రావచ్చు.

నెల్లూరుముచ్చట్లు

3వ పేజీ కొరవ

వేశంలో తెలుగు నేతలు సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి, బీద రవిచంద్ర, తాళ్లపాక రమేష్‌రెడ్డి, కిలారి వెంకటస్వామి నాయుడు పాల్గొన్నారు.

సంక్రాంతికి బెయిల్

మనీ సర్కులేషన్ స్కీంల వ్యవహారంలో ఒక స్వచ్ఛంద సంస్థ నుంచి 60 లక్షల రూపాయలు తీసుకొన్నాడన్న నేరారోపణపై సిబిడి పోలీసులు గతంలో అరెస్ట్ చేసిన మాజీ కార్పొరేటర్ సంక్రాంతి కళ్యాణ్‌కు జిల్లా జడ్జి 10వ తేది షరతులలో కూడిన బెయిల్ మంజూరు చేశారు.

హాస్టళ్లలో బసచేయని ఉన్నతాధికారులు!

ప్రభుత్వ వసతి గృహాల్లోని సమస్యలను గుర్తించేందుకు 9వ తేది రాత్రి వీటిలో జిల్లా ఉన్న తాధికారులు బసచేయమని ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వును ఉన్నతాధికారులే ఉల్లంఘించారు. ద్వితీయ శ్రేణి, తృతీయ శ్రేణి అధికారులు మాత్రం హాస్టళ్లలో నిద్రచేయగా ప్రథమ శ్రేణి అధికార యంత్రాంగం పరిశీలనలతో సరిపెట్టడం విమర్శలకు దారితీసింది.

శాంతి యజ్ఞం

కార్తీకమాసాన్ని పురస్కరించుకొని కుర్తాళం సిద్దేశ్వర పీఠం ఆస్థాన పండితులు మాచవోలు రాజ శేఖరశాస్త్రి లోక కళ్యాణార్థం నెల్లూరు టౌన్‌హాలులోని ఓపెన్ ఆడిటోరియంలో 10వ తేది శాంతి యజ్ఞం నిర్వహించారు. మృత్యుంజయ హోమం, ఆయుష్ హోమం, 1116 శివ లింగాల అభిషేకం, కాశీ నుండి ప్రత్యేకంగా తీసుకొచ్చిన రుద్రాక్షలతో శివునికి లక్షార్చన చేశారు. 16 అడుగుల శివలింగానికి అభిషేకాలు, 1116 శివలింగాలను పెన్నా నదిలో నిమజ్జనం చేసే కార్యక్రమం కన్నుల పండుగగా జరిగింది.

ప్రెస్, పోలీసుపై నిఘా

నగరంలో ప్రెస్, పోలీస్ అనే బోర్డులు పెట్టుకొని తిరిగే వాహనాలు అధికం అయ్యాయి. ఇలాంటి వారిలో అసలు కంటే నకిలీ బోర్డులతో తిరిగే వారే అధికం. ఇటీవల దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు అధికం కావడం, వివిధ వర్గాల ప్రజల నుంచి దీనిపై విమర్శలు చెలరేగడంతో పోలీసులు తమ పరువు కాపాడుకొనే పనిలో పడ్డారు. కొందరు ఇలాంటి బోర్డులతో దొంగలు తిరుగుతున్నారని అనుమానించిన పోలీసులు వీటిపై తనిఖీ చేపట్టారు. ప్రెస్, పోలీస్ అనే స్టిక్కర్లతో తిరుగుతున్న వాహనాలను నిలిపి గుర్తింపు కార్డులు తనిఖీ చేశారు. ఈ పని ఎప్పుడో చేసివుంటే బాగుండేది.



హోంగార్డుల పాసింగ్ అవుట్ పెరేడ్‌లో శిక్షణలో ప్రతిభ చూపించిన హోంగార్డుకు మెమెంటో అందజేస్తున్న ఎస్పీ బివి.రమణకుమార్.

సిపిఎం పాదయాత్ర

సిపిఎం నగరంలోని వివిధ డివిజన్లలో పాదయాత్ర చేపట్టింది. మౌలిక వసతులు కరువై ప్రజలు పలు ఇబ్బందులు పడుతున్నారని వీటన్నింటిపై ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండ గట్టడంతోపాటు ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చేందుకు ఈ పాదయాత్ర ప్రారంభించినట్లు సిపిఎం నేత మాదాల వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రజలు ధరలు పెరిగి, సిలిండర్లపై కోత విధించి, కరెంటు బిల్లులు పెరిగి తీవ్రమైన భారాన్ని మోస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేక పోవడం సిగ్గుచేటని విమర్శించారు.

కొళాయిల్లో మురుగునీరు

కొళాయిల్లో మురుగునీరు సరఫరా అవుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కొంత కాలంగా మునిసిపల్ కొళాయిల్లో నల్లని రంగులో నీరు వస్తోంది. కలుషితమై వస్తున్న ఈ నీటిని త్రాగలేక, వివిధ అవసరాలకు వినియోగించుకోలేక అవస్థలు పడుతున్నారు. ఇంతగా నీరు కలుషితమై రంగు మారిన నీరు సరఫరా అవుతున్నా అధికారులకు ఇవేమీ పట్టకపోవడం పట్ల ప్రజలు తీవ్రంగా మండి పడుతున్నారు. కానీ మునిసిపల్ అధికారుల చర్మం మందమన్న సంగతి ప్రజలు మరచినట్లున్నారు.

కలెక్టర్ సహపంక్తి భోజనం

హాస్టల్ విద్యార్థుల సమస్యలు తెలుసుకొనేందుకు జిల్లా కలెక్టర్ శ్రీధర్‌రెడ్డి నడుం బిగించారు. మెనూ సక్రమంగా అమయ్యేలా చూడడంతోపాటు ఆహారాన్ని పరిశీలించేందుకు ఆయన ఏకంగా హాస్టల్ విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. డిశంబర్ 9వ తేది రాత్రి కొండాయపాళెం గేటు వద్ద గల గిరిజన సంక్షేమ హాస్టల్‌కు వెళ్లిన ఆయన అక్కడి విద్యార్థులతో వివిధ అంశాలపై ముచ్చటించారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. ప్రక్కనున్న విద్యార్థినుల వద్ద నుంచి అన్న ముద్దలు కలిపి పెట్టించుకోవడంతో విద్యార్థులు సంతోషించారు. ఉపకార వేతనాల మొత్తాన్ని పెంచడంతో పాటు మెనూలో మార్పులు చేశారని, వీటిని సక్రమంగా అమలయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

జనవాణి

2వ పేజీ కొరవ

ర్థులు ఇతర రాష్ట్రాలకు విద్య కోసం వలసలను అరికట్టాలి.

ప్రొఫెసర్ నాగరాజరావు హైదరాబాద్

ఎస్సీ, ఎస్టీ ఉపప్రణాళికకు చట్టబద్ధత!

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత షెడ్యూల్డ్ కులాలు, తెగల అభ్యున్నతికి ప్రత్యేక ఉప ప్రణాళిక అమలు కోసం అసెంబ్లీలో ప్రత్యేక తీర్మానం ప్రవేశపెట్టడం ఆనందకరం. దీనివల్ల ప్రతి సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీల వాటా నిధులు వారికే చెందుతాయి. దీనివల్ల ఈ వర్గాల వారు అభివృద్ధి చెందుతారు. ఆనాడు స్వర్గీయ ఇందిరాగాంధీ ఎస్సీ, ఎస్టీలకు చేసిన ఎన్నో మేళ్లలో భాగంగానే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆ బాటలో నడవడం సంతోషదాయకం. కాంగ్రెస్ పార్టీ పట్ల ఎస్సీ, ఎస్టీలు నిరంతరం అభిమానం చూపాల్సిన చారిత్రక అవసరం నేడుందని ఈ వర్గీయులు గమనించమనవి.

టి.బాలసుధాకర్ నెల్లూరు


ప్రేరేపణే పెద్ద నేరం

ఈ మధ్య మనరాష్ట్ర మంత్రొకరు కేంద్రమంత్రొకరిని మాట మాట వచ్చి ఆత్మహత్య చేసుకోమన్నాడు. నేరం చేసిన వాడికంటే ప్రేరేపించిన వారే పెద్ద నేరస్తులు. కోర్టులు సుమోటోగా తీసుకొని విచారించి ఈ రాష్ట్రమంత్రిని ఎందుకు శిక్షించకూడదు?

తూపిలి వనమాలి నెల్లూరు

పదరంగం -46

నిర్వహణ : బాబాజీ



అడ్డం

1. ఇంద్రచాపమే... కాని హరిదట (4)
4. దేవర భార్య (3)
7. వాయసం (2)
9. తెలుగు దూప్లికేటు (3)
11. దండోరా (3)
13. మెరుపు తీగ (4)
15. గవాక్షాలు, అటు ఇటు మారాయి (4)
17. ఆడుమానం (3)
18. ఒక కోర్టు ఉద్యోగి (3)
21. పడమర దిశ (3)
22. వృద్ధుడు (4)
23. బీజం, ధనం (2)
25. ఒక పప్పు దినుసు బ్లాక్‌గ్రాం (3)
26. సంహారం (2)
27. ముప్పది తొమ్మిది తరువాత? (4)
29. పాలించడం (3)
30. ప్రమదావనంలో స్త్రీ (3)
32. లేకపోతే లేదని చెప్పు (2)
34. ప్రగతిని చూపండి 3, 2, 4 అక్షరాలు (3)
35. మరమ్మత్తు (3)
38. గాడిద (2)
39. రెండు 'లుక'లతో లోటుబాట్లు (5)
40. పాము (2)

నిలువు

1. విష్ణువు (2)
2. వైనతేయుని తల్లి (3)
3. తాటి చెట్టు నుంచి లభించే సుర క్రింద నుంచి (4)
5. తెలుగు హంటింగ్ (2)
6. చెదిరిన మాలిన్యం (3)
8. అర్జునుడు (3)
10. క్రింద నుంచి అసత్యాలు (3)
12. ఉత్తరప్రదేశ్‌లోని శీతల విహార స్థలం (5)
14. అంటువ్యాధి అయిన అమ్మవారు; తోచు (2)
16. పాపానికి నిష్కృతి (4)
18. సరియైన సమయం (3)
19. మగవారి మూతి మీద మొలిచేది (3)
20. ప్రేమతో కూడిన భక్తి (4)
21. పావనం (3)
22. తడబడిన ముదిమి (3)
24. భార్యాభర్తలు (5)
26. గ్రాంధికంలో వద్దు (3)
27. శపథం చెదిరింది (3)
28. చెట్లపై బ్రతికే పరాన్న మొక్క (4)
29. సేద్యగాడు (3)
31. వాంఛ (3)
33. జాబు (2)
36. తల మీద జీవించే జీవులు (2)
37. నది పాయ, జడ (2)

సమాధానాలు

పదరంగం -45

1వ్య	2వ	3ధా	నం		4త	రు	5ణు	6లు		7రు
8వ	ని	త		9తే	రు		10వు	పా		గు
సా			11ఆ	నె	లు		12వే	డి	13కో	లు
14ద్యు	15త్రం					16శి		17వే	మ	న
	రా					18వా	19న		లి	
20య	తి				21ప	రు	వం			22డా
	23అ	24లం	కా	25రం			26బ	27స్తి	బా	బు
28సా		క		పు		29లు	రు	సు		స
30క్షౌ	మం			31కా	32రు	పు			33నా	రి
త్కా		34పా	35లు		36ఆ	ల	మం	37ద	లు	
38రం	గ	డి	తే	రు		త		39పే	క	లు

సంక్షిప్త సింహపురి

జనాన్ని చైతన్యపరచండి!

నెల్లూరు నగరంలో వరుసగా దొంగతనాలు జరుగుతున్నాయని, వాటిని నివారించేందుకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి అప్రమత్తంగా ఉండేలా ప్రజలను చైతన్య పరచాలని నగర డిఎస్పీ వెంకటనాధ్‌రెడ్డి ఆదేశించారు. డిఎస్పీ తన కార్యాలయంలో 6వ తేది సాయంత్రం నగరంలోని ఆరుగురు లా అండ్ ఆర్డర్ సిఐలు, క్రైం, ట్రాఫిక్ సిఐలతో సమీక్షా సమావేశం నిర్వహించి వీరికి పలు సూచనలు సలహాలిచ్చారు. అపార్టుమెంట్లు, రద్దీగా ఉండే ప్రాంతాల్లో అవగాహన సదస్సులు పెట్టండి. ఇళ్లకు తాళాలువేసి బయట ఊర్లకు వేళ్లే సమయంలో బీరువాల్లో విలువైన వస్తువులు ఉంచకుండా జాగ్రత్త వహించే విధంగా కొన్ని సూచనలతో కూడిన కరపత్రాలను ముద్రించి ప్రతి ఇంటికి పంపిణీ చేయాలన్నారు. బయట ఊర్లకు వెళ్తే సమీప పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇచ్చి వెళ్లాలన్నారు. జైలు నుంచి విడుదలైన దొంగలపై నిఘా ఉంచాలన్నారు. ట్రాఫిక్ గందరగోళంగా తయారవుతున్నా పట్టించుకోని ట్రాఫిక్ విభాగపు సిఐలు, ఎస్‌ఐలను డిఎస్పీ మందలించారు. ఈ సమావేశంలో సిఐలు వీరాంజనేయరెడ్డి, కోటారెడ్డి, కె.వి.రత్నం, ఎస్వీ రాజశేఖర్‌రెడ్డి, రామారావు, ఎం.శ్రీనివాసరావు, ఎన్.సురేష్‌కుమార్ రెడ్డి, ఎన్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శ్రీ గాయత్రి విద్యార్థుల సాయం!



బ్లడ్ క్యాన్సర్‌తో బాధ పడుతున్న దుత్తలూరు మండలం తురకపల్లి గ్రామానికి చెందిన పన్నెండేళ్ల బాలుడు నరేష్‌కి చికిత్స నిమిత్తం శ్రీ గాయత్రి విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులు 33,500 రూపాయలు సేకరించారు. ఈ మొత్తాన్ని తమ విద్యాసంస్థల ఏజిఎమ్, జోనల్ ఇన్‌ఛార్జ్, ప్రిన్సిపాల్ చేతులమీదుగా 6వ తేది నరేష్ తల్లితండ్రులు సుబ్బరాయుడు, సుభాషిణిలకు అందించారు.

సముద్ర తాబేళ్లను కాపాడుదాం!

సముద్ర పర్యావరణ పరిరక్షణతోపాటు సముద్ర తాబేళ్లను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అటవీ శాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఎ.వి.జోసఫ్ చెప్పారు. 6వ తేది కలక్టరేట్‌లోని గోల్డన్ జూబ్లీహాల్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తాబేళ్లను పరిరక్షిస్తే మత్స్య సంపద పెరుగుతుంది. ఈ విషయమై మత్స్యకారులకు అవగాహన కల్పించాలి. దీనికోసం మత్స్య శాఖ, అటవీ శాఖ సమన్వయంతో పనిచేయాలి. స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలన్నారు. కలెక్టర్ బి.శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని తీరప్రాంత మండలాలైన కొడవలూరు, విడవలూరు, అల్లూరు, ఇందుకూరు పేటల్లో తాబేళ్ల ఉత్పత్తి కేంద్రాలు పనిచేస్తున్నాయన్నారు. తాబేళ్లను కాపాడుకోవాలనే విషయమై మత్స్యకారులకు తప్పకుండా అవగాహన కల్పించాల్సిన బాధ్యత అటవీ శాఖపై ఉందన్నారు. ఎస్పీ రమణకుమార్, జిల్లా అటవీ శాఖాధికారి ఎన్.నాగేశ్వరరావు, ట్రీ ఫౌండేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ సుప్రజ ధరిణి, మెరైన్ కోస్టల్ గార్డ్ కమాండెంట్ సిఆర్‌కెరావు, అటవీ సిబ్బంది, మెరైన్ సిబ్బంది ఈ సమావేశంలో పాల్గొన్నారు.


కిషోర్ రత్నం స్కూల్ విద్యార్థిని ప్రతిభ!



రష్యాలోని మాస్కో నగరంలో జరిగిన ప్రపంచ యోగా పోటీల్లో నెల్లూరు సరస్వతినగర్‌లోని డాక్టర్ కిషోర్ రత్నం స్కూల్ ఒలింపియాడ్ బ్యాచ్‌లో ఎనిమిదవ తరగతి చదివే బాలిక కె.జోషిత అంతర్జాతీయ స్థాయి యోగాసనాలలో బంగారు పతకం సాధించింది. 40 మంది ఈ విభాగంలో ఈ బాలికతో పోటీ పడ్డారు. జోషిత ఆర్టిస్టిక్ పెయిర్, రిథమిక్ పెయిర్ విభాగాల్లో కాంస్య పతకాన్ని సాధించింది. ఈ సందర్భంగా జోషిత అభినందన సభ హోటల్ లియోలో 6వ తేది జరిగింది. డిఇఓ రామలింగం ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడల్లో కూడా ప్రోత్సాహమందిస్తున్న స్కూల్ నిర్వాహకులు డాక్టర్ కృష్ణ కిషోర్, వాసంతి కిషోర్‌లను అభినందించారు. అంతర్జాతీయ పోటీల్లో విజేతగా నిల్చిన జోషితను విద్యార్థినీ, విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. జోషిత వార్త దినపత్రిక మేనేజర్ రాజు కుమార్తె. ఈ అభినందన సభలో రత్నం విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు, ప్రిన్సిపాల్ కెవిడి మనోజ్‌కుమార్, ఎ.ఒ.రుక్మిణి పాల్గొన్నారు.

వైకాపా నేతృత్వంలో నేత్ర వైద్య శిబిరం!

నెల్లూరు రూరల్ నియోజకవర్గం వైకాపా నాయకుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నేతృత్వంలో వేదాయపాళెంలోని ఎంవిఎస్ కళ్యాణ మండపంలో నిర్వహించిన భారీ కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. 700 మందికి పైగా వివిధ కంటి రుగ్మతలతో బాధపడే రోగులు ఈ శిబిరానికి హాజరయ్యారు. శిబిర ప్రారంభ సమయంలో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ తాను రూరల్ నియోజకవర్గంలో పాదయాత్ర చేసినప్పుడు ఎంతో మంది ప్రజలు కంటి సమస్యలతో ఇబ్బంది పడడాన్ని గుర్తించి ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు చెప్పారు. చెన్నైకి చెందిన మధురై నేత్రాలయ డాక్టర్లు ఈ శిబిరానికి హాజరై బాధితులకు కంటి వైద్య పరీక్షలు చేయగా 85 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించామన్నారు. వీరందరికీ మధురై నేత్రాలయ ఆస్పత్రిలో ఆపరేషన్లు చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. మరో 127 మందికి ఉచితంగా కళ్లజోళ్లను, మందులను పంపిణీ చేశామని శ్రీధర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎన్.వేణుగోపాల్‌రెడ్డి, పిగిలం నరేష్, తాటి వెంకటేశ్వర్లు, శ్రీకాంత్‌రెడ్డి, రాఘవరెడ్డి, రూప్‌కుమార్, మందా బాబ్జి, అరుణమ్మ, సుజిత, నిర్మల, హసీనా, సరళ తదితరులు పాల్గొన్నారు.



రైతు లోకం

వేరుశనగ సాగులో మెళకువలు

మన జిల్లాలో రబీ సీజన్‌లో వేరుశనగను డిసెంబరు నెలాఖరు వరకు విత్తుకొనవచ్చును. ఈ దిగువ సూచించిన మెళకువలను పాటించి అధిక దిగుబడులు సాధించవచ్చు.

నీరు త్వరగా ఇంకిపోయే తేలికపాటి ఎర్ర నేలలు, తగినంత సేంద్రీయ పదార్థాలు, కాల్షియం, గంధకం వుండే భూములు శ్రేష్ఠమైనవి. ఉదజని సూచిక (పిహెచ్) 5.3 నుండి 6.6 వరకు వున్న నేలలు అనువైనవి. మెత్తటి దుక్కి చేసి, మంచి తేమ పదునులో విత్తాలి. విత్తనాలు 4-5 సెంటీమీటర్ల కన్నా లోతుగా విత్తరాదు. విత్తనం ద్వారా వ్యాప్తి చెందే మొదలు కుళ్లు (కాలర్ రాట్)కు కారణమైన శిలీంధ్రాన్ని అదుపులో పెట్టడానికి మాంకోజెబ్ 3గ్రాములు లేక ట్రైకోడర్మా విరిడి 4 గ్రాములు కిలో విత్తనానికి చొప్పున కలిపి విత్తన శుద్ధి చేయాలి.

మొవ్వు కుళ్లు, కాండం కుళ్లు వైరస్ తెగులు వచ్చే ప్రాంతాలలో పొలం చుట్టూ 3-4 వరుసలు జొన్న, సజ్జ, మొక్కజొన్న వంటివి వేసుకొంటే ఈ తెగుళ్ల ఉధృతిని అరికట్టవచ్చు.

డాక్టర్ కె.పుల్లంరాజు
కోఆర్డినేటర్,
ఏరువాక (డాట్ సెంటర్), నెల్లూరు.

నీటిపారుదల క్రింద ఎకరానికి 100 కిలోల సూపర్ ఫాస్ఫేట్ మరియు 35 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఆఖరి దుక్కిలో వేయాలి. అలాగే 18 కిలోల యూరియాని విత్తే సమయంలో, 9 కిలోల యూరియాను 30 రోజుల తర్వాత అంటే తొలి పూతదశలో వేసుకోవాలి. ఎకరానికి 200 కిలోల జిప్సంను తొలి పూత సమయంలో మొక్కల మొదళ్ల దగ్గర చాళ్లలో వేసి, కలుపు తీసి మొక్కల మొదళ్లకు మట్టిని ఎగదోయాలి.

కలుపు బారి నుండి విత్తిన 45 రోజుల వరకు సంరక్షించుట అవసరం. దీనికిగాను విత్తిన వెంటనే గానీ, మరుసటి రోజున గానీ పెండిమిథాలిన్ 30% ఎకరాకు 1.5 లీటర్లు లేక బ్యుటాక్లోర్ 2లీటర్లు (లీటరు నీటికి 5 మిల్లీలీటర్లు) పిచికారీ చేయాలి. 45రోజుల తర్వాత ఏ విధమైన అంతర కృషి చేయరాదు.

Regn.No. : RN 1156 / 57 J/Nellore/008/12-14

అఖిలపక్షం అతిపెద్ద మోసం!

- **తెలంగాణపై కాంగ్రెస్ తన నిర్ణయం చెప్పలేదు.**
- **తాజా అఖిలపక్షం నోట్‌లో ఎమ్పీలు అడిగారు కాబట్టి సమావేశం పెడుతున్నట్లు పేర్కొన్నారు.**
- **రాష్ట్రంలో ఏ పార్టీకి తెలంగాణ అంశంపై స్పష్టత లేదు.**
- **పేచీకోరు పాత్ర పోషిస్తున్న కేంద్రం.**

ఆంధ్రప్రదేశ్ శాసనసభలో అతి పెద్ద పార్టీ కాంగ్రెస్. లోక్‌సభలో కూడా అతి పెద్ద పార్టీ కాంగ్రెస్. రెండు చోట్లా అధికారంలో వుండేది అదే. తెలంగాణకు ప్రత్యేక రాష్ట్రం ఇవ్వాలంటే శాసనసభలో తీర్మానం జరగాలి. లోక్‌సభలో రాష్ట్రాల విభజనపై రాజ్యాంగ సవరణ జరగాలి. ఆ పనులు చేయవల్సింది, చేయగలిగింది కాంగ్రెస్ పార్టీ లేదా దాని ప్రభుత్వాలు మాత్రమే. కానీ తెలంగాణపై ఆ పార్టీ ఇప్పటి వరకు తన అభిమతం ఏమిటో, అభిప్రాయం ఏమిటో చెప్పలేదు. ఇప్పట్లో చెప్పే సూచన కూడా కన్పించడం లేదు. 2004 ఎన్నికలలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి టిఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకొన్నాడు. తనతోపాటు సోనియాగాంధీకి కూడా గులాబీ కండువా వేసి ప్రచారం చేశారు. టిఆర్ఎస్ ఉనికే తెలంగాణ విభజన కోసం ఏర్పడింది. దానితో ఎన్నికల పొత్తు అంటే తెలంగాణ ఇవ్వడానికి కాంగ్రెస్ సమ్మతించినట్లే భావించాలి. కానీ ఐదేళ్లపాటు వైఎస్ ఆ వూసు ఎత్తలేదు. సోనియాగాంధీ కెసిఆర్‌కు కేంద్రంలో మంత్రి పదవి అయితే ఇచ్చింది కానీ తెలంగాణ మీద తన మనసులోని మాట చెప్పలేదు. 2009 ఎన్నికలొచ్చేసరికి వైఎస్ ప్లేట్ ఫిరాయించాడు. తెలంగాణ అంటూ ఏర్పడితే ఆంధ్ర, రాయల సీమవాసులు అక్కడకు వెళ్లడానికి వీసా పాస్‌పోర్టులు అవసరం పడుతాయని కర్నూల్ సభలో ఘాటుగా వ్యాఖ్యానించారాయన. అంటే తెలంగాణ ఇవ్వడం ఆయనకు ఇష్టం లేదని అర్థం.

2004లో అధికారంలోకి వచ్చినప్పుడు యుపిఏ తరపున ఏర్పాటు చేసుకొన్న కామన్ మినిమమ్ ప్రోగ్రాంలో తెలంగాణ అంశాన్ని చేర్చింది కేంద్ర ప్రభుత్వం. రాష్ట్రపతి అబ్దుల్ కలాం ఉభయ సభలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో ఈ అంశాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. రాష్ట్రపతి నోట మాట అంటే శాసనం క్రిందనే లెక్క. ఏ ప్రభుత్వం కూడా దాని నుంచి వెనక్కు తగ్గడానికి లేదు. కానీ ప్రధాని మన్మోహన్‌సింగ్ ఆ తర్వాత పలు సందర్భాలలో తెలంగాణకు, నక్సల్ సమస్యకు ముడి పెట్టి మాట్లాడారు. తెలంగాణ ఇస్తే నక్సల్స్ రెచ్చిపోతారని వ్యాఖ్యానించారు. ఆయన ఉద్దేశ్యం అదే అయినప్పుడు రాష్ట్రపతి నోట ఆ మాట పలికించడం ఎందుకు?

రోశయ్య ముఖ్యమంత్రిగా వున్నప్పుడు కెసిఆర్ చేసిన నిరాహార దీక్షకు తల్లడిల్లిపోయిన కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ఇస్తున్నట్లు ప్రకటన చేసింది. చిదంబరం హోంమంత్రి హోదాలో ఆ ప్రకటన చేశాడు. కానీ కొందరు ఎమ్మెల్యేలు రాజీనామా చేయగానే అదే చిదంబరం ప్లేట్ ఫిరాయించాడు. తన నిర్ణయాన్ని ఉపసంహరించుకొన్నాడు. తెలంగాణ ఇవ్వడానికి కేంద్రం చెప్పే అడ్డంకులు ప్రధానంగా నక్సలైట్లు, ఈశాన్య రాష్ట్రాలలో ఉద్యమాలు. ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్‌లు చిన్న రాష్ట్రాలు కాబట్టే అక్కడ నక్సల్స్ బలపడిపోయారని చెప్తున్నది కేంద్ర ప్రభుత్వం. నాగాలాండ్, మిజోరాం, మేఘాలయ, త్రిపుర, మణిపూర్ వంటి రాష్ట్రాలన్నిటిలో వేర్పాటువాద ఉద్యమాలు హింసాయుతంగా నడుస్తున్నాయి కాబట్టి తెలంగాణ ఇచ్చిన ప్రక్క క్షణం వారు రెచ్చిపోతారని, గూర్ఖాలాండ్ సమస్య మొదటికి వస్తుందని వాదిస్తున్నది హోం శాఖ. అదే నిజమైతే అదే హోం మంత్రి తెలంగాణ ఇవ్వడానికి ఎందుకు ప్రకటన చేసినట్లు? ఆ రోజు ఈ వేర్పాటువాద ఉద్యమాలు ఎందుకు అడ్డంకి కాలేదు?

రెడ్డొచ్చె మొదలాడు అన్నట్లు ఇప్పుడు తాజాగా కొత్త హోంమంత్రి సుశీల్‌కుమార్ షిండే మరొకసారి అఖిల పక్ష సమావేశం పిలిచాడు. కేంద్ర ప్రభుత్వ నిర్వహణలో, కేంద్ర ప్రభుత్వ పరిపాలనకు రాజదర్బారు వంటి నార్త్‌బ్లాక్‌లో అఖిల పక్ష సమావేశం అంటే తెలంగాణ సమస్య మీద ఒక నిర్ణయం తీసుకోవడానికి కేంద్రం సన్నద్ధమైందని ప్రజలు భావిస్తారు. కానీ విచిత్రంగా ఆ సమావేశానికి హోం శాఖ పంపిన ఆహ్వానంలో ఆ సూచనే లేదు. కొందరు ఎమ్పీలు అఖిల పక్ష సమావేశం పెట్టమని అడిగారు కాబట్టి, పెడుతున్నామని, దానికి మీరు ఇద్దరేసి ప్రతినిధుల చొప్పున పంపాలని కోరారు. ఎమ్పీలు అడిగితే సమావేశం పెట్టడానికి అది కేంద్ర ప్రభుత్వమా లేక ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీయా?

ఆంధ్రప్రదేశ్‌లో ఏ రాజకీయ పార్టీకి కూడా తెలంగాణపై ఒక నిర్దిష్టమైన విధానం లేదు. ఆంధ్రలో ఒక రకంగా, తెలంగాణలో మరొక రకంగా మాట్లాడడం అలవాటు చేసుకొన్నాయి అవి. రెండు ప్రాంతాలలో ఓట్లున్నాయి కాబట్టి అది వారికి తప్పని సరి. కరవమంటే కప్పకు కోపం విడవమంటే పాముకు కష్టం అన్న పరిస్థితి నెలకొని వున్నప్పుడు ఎవరు మాత్రం ఏమి చేస్తారు? ఒక్క టిఆర్ఎస్ మాత్రమే తెలంగాణ మీద నిలబడి వుంది. వారికి ఆంధ్రలో ఓట్లు లేవు. ఈ నేపథ్యం అంతా కేంద్ర ప్రభుత్వానికి తెలుసు. కానీ తాము జరిపే అఖిల పక్ష సమావేశానికి ఇద్దరేసి ప్రతినిధులను పంపమని కోరింది. అంటే తాంబూలాలిస్తాము తన్నుక చావండి అన్నది కేంద్ర ప్రభుత్వ ఉద్దేశ్యమా? తెలంగాణ కావాలా వద్దా అన్న అభిప్రాయం చెప్పడానికి రాజకీయ పార్టీల నుంచి ఇద్దరేసి ప్రతినిధులు ఎందుకు? పార్టీ విధానం ఒక్క ప్రతినిధి చెప్పలేడా? ఇద్దరిని పంపమని కోరడం అంటే సహజంగానే రెండు ప్రాంతాల నుంచి ప్రతినిధులను పంపక తప్పదు పార్టీలకు. వారు వచ్చి ఎవరి వాదన వారు విన్పిస్తారు. ఒకే పార్టీలలో రెండు అభిప్రాయాలు వ్యక్తం అవుతాయి. రాజకీయ పార్టీల మధ్యనే కాకుండా రాజకీయ పార్టీల లోపల కూడా ఏకాభిప్రాయం లేదు కాబట్టి ఇప్పట్లో తెలంగాణ విషయం తేల్చలేమని చెప్పి తప్పించుకోవడానికి హోం మంత్రిత్వ శాఖ ఆడుతున్న నాటకం తప్ప ఈ అఖిలపక్ష సమావేశానికి వేరొక పరమార్థం లేదు.

ఎందుకీ మోసాలు? ఎందుకీ వేషాలు? అధికారంలో వున్న అతి పెద్ద పార్టీ తన అభిమతం ఏమిటో చెప్పకుండా అఖిల పక్ష సమావేశం పిలవడమే తప్పు. దానికి ఇద్దరు ప్రతినిధులను పంపమని సూచించి పార్టీల లోపల పేచీలు సృష్టించడం ఇంకా పెద్ద నేరం. కేంద్ర ప్రభుత్వం అంటే నూట పాతిక కోట్ల మంది ప్రజలను పాలించే వ్యవస్థ. తను వేసే ప్రతి అడుగు ఆచి తూచి వేయవలసిన బాధ్యత వారి మీద వుంది. పిల్లల ఆటలకు దిగి, తంపులు పెట్టి తమాషా చూసే వెర్రి వేషాలకు కేంద్ర ప్రభుత్వం దిగడం దారుణమైన విషయం. తెలంగాణ ఇవ్వడం ఇష్టం లేకుంటే ఆ మాట స్పష్టంగా చెప్పడానికి వెనుకడుగు ఎందుకు? దాని వల్ల తెలంగాణ ఓట్లు పోతాయనే భయం కాంగ్రెస్ పార్టీకి వుండాలే కానీ, కేంద్ర ప్రభుత్వానికి కాదు. ప్రభుత్వం ప్రజల కోసం పని చేయాలే తప్ప ఓట్ల కోసం కాదు. పార్టీ వేరు, ప్రభుత్వం వేరు. పాలించే వారు ఒక్కొక్కసారి కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పదు. అమెరికాతో అణు ఒప్పందం జాతి ప్రయోజనాలకు వ్యతిరేకమని యావత్ దేశం కోడై కూసింది. లోక్‌సభలో ప్రధాన పక్షాలన్నీ దాన్ని వ్యతిరేకించాయి. ఎవరిలోనూ ఏకాభిప్రాయం లేదు. కానీ ఆయా పార్టీలను బెదరించి, భయపెట్టి, లొంగ దీసుకొని ఒప్పందానికి ఆమోద ముద్ర వేయించుకొన్నాడు ప్రధానమంత్రి. చిల్లర అంగళ్లలో విదేశీ పెట్టుబడుల విషయంలో అయితే లోక్‌సభలోని 19 పార్టీలలో 14 పార్టీలు వ్యతిరేకించాయి. ప్రభుత్వంలో భాగస్వాములైన డిఎంకె, ప్రభుత్వాన్ని బయట నుంచి నిలబెడుతున్న బిఎస్పి, సమాజ్‌వాది పార్టీలు ప్రతిఘటించాయి. కానీ ఆ తీర్మానానికి ఆమోద ముద్ర వేయించుకొన్నాడు. జాతి యావత్తూ ప్రభావితం అయ్యే విషయంలో ఏకాభిప్రాయం లేకుండానే తన అభిమతాన్ని నేరవేర్చుకొన్న కాంగ్రెస్ పార్టీ, ఒక్క రాష్ట్రంలో ఒక చిన్న ప్రాంతానికి సంబంధించిన అంశంలో మాత్రం జాతీయస్థాయిలో ఏకాభిప్రాయం కావాలని పట్టుబట్టడంలో ఉద్దేశ్యం ఏమిటి? అది ఉద్దేశమా దురుద్దేశమా?

ఏది ఏమైనా తెలంగాణ విషయంలో కేంద్ర ప్రభుత్వం పేచీకోరు వలె వ్యవహరిస్తున్నది. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల జీవితాలతో ఆటలాడుతున్నది. ఇది ఎంతమాత్రం సముచితం కాదు. కోట్లాది మంది ప్రజల జీవితాలతో ముడిపడిన సమస్య విషయంలో ఒక అభిప్రాయం అంటూ లేకుండా ఒక విధానం అంటూ లేకుండా ఏళ్ల తరబడి నాన్చుడు వైఖరి అవలంభించడం ఎంతమాత్రం క్షమించతగిన విషయం కాదు.

ముఖ్యమంత్రిని అవమానించారు!



తెలంగాణ అంశం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వివాదం. కిరణ్‌కుమార్‌రెడ్డి ఆంధ్ర ప్రదేశ్‌కు ముఖ్యమంత్రి. ఆయనేమీ ప్రతిపక్షాలకు చెందిన నేత కాదు. కాంగ్రెస్ కుటుంబ సభ్యుడు. మనది ఫెడరల్ రాజ్యాంగ వ్యవస్థ. రక్షణ, విదేశీ వ్యవహారాల వంటి కొన్ని నిర్దిష్టమైన అంశాలలో తప్ప తతిమా వాటన్నిటిలో రాష్ట్రాలకు స్వతంత్ర ప్రతిపత్తి వుంది. కేంద్రం తీసుకొనే ఏ నిర్ణయంలో అయినా రాష్ట్రాలను భాగస్వాములను చేయక తప్పదు. తెలంగాణ విషయంలో ఒక నిర్ణయం తీసుకోవడానికి, లేదా నిర్ణయానికి కావలసిన అవగాహన ఏర్పర్చుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ఒక సమావేశం నిర్ణయించదలచినప్పుడు ఆ రాష్ట్ర ప్రభుత్వంతో, ముఖ్యమంత్రితో సంప్రదించడం కనీస మర్యాద. కానీ విచిత్రంగా కేంద్ర హోంమంత్రి సుశీల్‌కుమార్ షిండే కొందరు కాంగ్రెస్ ఎమ్పీల కోరిక మీద అఖిల పక్ష సమావేశం జరపాలని నిర్ణయం తీసుకొన్నాడు. దానికి స్థలం, సమయం తానే నిర్ణయించాడు. ఆయన నిర్ణయించిన తేది నాడు ఆంధ్రప్రదేశ్‌లో ప్రపంచ తెలుగు మహాసభలు జరుగుతున్నాయి. భాషా ప్రాతిపదికన రాష్ట్రాల విభజన జరిగిన వాస్తవాన్ని దృష్టిలో పెట్టుకొంటే, ఒక రాష్ట్రంలో దాని అధికార భాష సభలకు ఎంత ప్రాధాన్యత వుంటుందో అర్థం చేసుకోవచ్చు. ముఖ్యమంత్రితో సహా మొత్తం ప్రభుత్వ యంత్రాంగం ఆ మహాసభలలో నిమగ్నమై వున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ వంటి కీలక వివాదంపై సమావేశం నిర్వహించడం ఏమిటి? ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి ఆ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్లాడు. మరొక తేదీ పెట్టుకోమని విజ్ఞప్తి చేశాడు. కానీ హోం మంత్రి విన్పించుకోలేదు. నేను చెప్పిన తేదీ రోజే సమావేశం జరుగుతుందని నిక్కచ్చిగా చెప్పాడు.

ముఖ్యమంత్రితో కనీసపాటి సంప్రదింపులు, సమాచారం లేకుండా ఇటువంటి సమావేశాల నిర్ణయం తీసుకోవడమే తప్పు. అది ముఖ్యమంత్రిని అవమానించడం క్రిందే లెక్క. ఆ సమావేశం తేదీతో తమకు ఇబ్బందులున్నాయని ముఖ్యమంత్రి స్వయంగా విన్నవించినా విన్పించుకోకపోవడం మరింత పెద్ద అపరాధం. ప్రభుత్వం అంటే హోం మంత్రి స్వంత జాగీరు కాదు. ఒక ముఖ్యమంత్రిని అవమానించడం అంటే ఆ రాష్ట్ర ప్రజలు మొత్తాన్ని అవమానించడం క్రిందనే లెక్క. ముప్పయ్యేళ్ల క్రితం ముఖ్యమంత్రి అంజయ్యను అవమానించి ఆంధ్రుల ఆత్మగౌరవం నినాదానికి ఆస్కారమిచ్చింది కాంగ్రెస్ పార్టీ. ఇప్పుడు కిరణ్‌కుమార్‌రెడ్డిని అగౌరవపరచి అటువంటి వినాశనాన్ని కొని తెచ్చుకొంటున్నది.



Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore. E-mail : jaminryot@yahoo.com